


ప్రజాస్పూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 23-09-2026 | సంపుటి - 31 | సంచిక - 121 | రూ : 4 | పేజీలు: 8



మోగిన ఎన్నికల నగారా

అక్టోబర్ 16న రాజ్యసభ ఎన్నికలు

- మూడు రాష్ట్రాల్లో 12 స్థానాలకు పోలింగ్ అదే రోజు ఓట్ల లెక్కింపు
- ఈనెల 29న నోటిఫికేషన్

న్యూఢిల్లీ బ్యూరో : ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ , పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో ఎన్నికల నగారా మోగింది. రాజ్యసభలో ఖాళీ కానున్న 12 స్థానాలకు కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. ఉత్తర్‌ప్రదేశ్‌లో 10 స్థానాలు, ఉత్తరాఖండ్‌లో ఒకటి, పశ్చిమ బెంగాల్‌లో ఒక స్థానానికి అక్టోబర్ 16న ఉప ఎన్నికలు జరగనున్నాయి. అదే రోజు ఓట్ల లెక్కింపు కూడా చేపట్టనున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది.

సెప్టెంబర్ 29న నోటిఫికేషన్

ఈ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ సెప్టెంబర్ 29న విడుదల కానుంది. నామినేషన్ల దాఖలుకు అక్టోబర్ 6 చివరి తేదీగా ఈసీ నిర్ణయించింది. అక్టోబర్ 7న నామినేషన్ల పరిశీలన చేపట్టనున్నారు. నామినేషన్లను తరువాయి 2లో

ఎస్సీ, ఎస్టీ బాధిత కుటుంబాలకు సత్వర న్యాయం

- గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు విడుదల
- వెంటనే నష్ట పరిహారం చెల్లింపు
- రెగ్యులర్ గా జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీల సమావేశాలు :రాష్ట్ర స్థాయి ఉన్నత నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి




హైదరాబాద్ : ఎస్సీ, ఎస్టీలపై అట్రాసిటీ కేసుల్లో బాధిత కుటుంబాలకు సత్వర న్యాయం చేయాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం-1989 అమలు తరువాయి 2లో

జూరాల.. నీరెలా?

- డ్యాం వద్ద సాగునీటి సెగ
- వార బంధీ అన్నారు...నీటిని నిలిపేశారు
- ఆయకట్టుకు నీరందని పరిస్థితి
- ఆందోళనలో అన్నదాత

2లో



దేశంలోనే భారీ రియల్ ఎస్టేట్ డీల్

రూ. 711 కోట్లతో భవనం కొనుగోలు

- దేశంలోనే అత్యంత ఖరీదైన రెసిడెన్షియల్ డీల్ నమోదు
- రూ. 711 కోట్లకు ముంబైలో 8 అంతస్తుల టవర్ కొనుగోలు
- భవనం కొనుగోలు చేసిన ఏంజెల్ వన్ వ్యవస్థాపకుడు దినేష్ థక్కర్
- ఈ డీల్‌తో భారీగా లాభ పడిన డెవలపర్ కం పెనీ షేర్లు



దేశ ఆర్థిక రాజధాని ముంబైలో దేశంలోనే అతిపెద్ద రెసిడెన్షియల్ ప్రాపర్టీ డీల్ నమోదైంది. ప్రముఖ స్టాక్ బ్రోకింగ్ సంస్థ 'ఏంజెల్ వన్' వ్యవస్థాపకుడు దినేష్ థక్కర్, సముద్ర తరువాయి 2లో



ట్రంప్ పక్షాన నిలిచినా..


తప్పని అవమానాలు!

- ట్రంప్‌కు మద్దతిస్తున్న భారత సంతతికి జాత్యహంకార వ్యాఖ్యలు
- భావజాలం కన్నా జాతే ముఖ్యమంటున్న కొందరు ట్రంప్ మద్దతుదారులు
- భారత సంతతి నేత హర్మీత్ ధిల్లాన్‌పై సొంత వర్గం నుంచే దాడి
- గతంలో ప్రోగ్రెసివ్‌లకే పరిమితమైన దాడులు.. ఇప్పుడు కన్జర్వేటివ్‌లపైనా
- "అసలైన అమెరికన్" అని నిరూపించుకోవాల్సిన దుస్థితి 2లో

అమెరికాకు ఇరాన్ ఆఫర్

తగ్గిన క్రూడాయిల్ ధరలు

- హర్ముజ్ జలసంధి తెరవడానికి సిద్ధమన్న ఇరాన్
- అమెరికా సైనిక ఒత్తిడి తగ్గించాలని షరతు
- పోర్టుల దిగ్బంధనం ఎత్తివేయాలని డిమాండ్
- మధ్యవర్తుల ద్వారా అమెరికాకు ప్రతిపాదన 2లో
- చమురు ధరలు 99 డాలర్ల దిగువకు పతనం





అమెరికాలో 90 అడుగుల

హనుమాన్ విగ్రహ వివాదం

- కూల్చేస్తామంటూ సోషల్ మీడియాలో వ్యాఖ్యలతో రాజుకున్న దుమారం
- ఇది హిందూ మతంపై దాడి అంటూ అమెరికాలోని హిందూ సంఘాల ఆగ్రహం
- అమెరికా మధ్యంతర ఎన్నికల వేళ మతపరమైన చర్చకు దారితీసిన ఘటన
- విగ్రహం ప్రైవేట్ ఆస్తిలో ఉందని, ఐక్యతకు చిహ్నమని ఆలయ వర్గాల వెల్లడి

అమెరికాలోని టెక్సాస్‌లో ప్రతిష్ఠించిన 90 అడుగుల భారీ హనుమాన్ విగ్రహం ఇప్పుడు రాజకీయ, తరువాయి 2లో

జైలుకైనా సిద్ధం

డిసెంబర్‌లో స్వదేశానికి షేక్ హసీనా

- ఉరిశిక్ష రాజకీయ ప్రేరేపితమని, జైలుకు వెళ్లేందుకైనా సిద్ధమని స్పష్టం
- అవామీ లీగ్ పార్టీని పునర్నిర్మించి, ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడమే లక్ష్యం
- బంగ్లాలో ఉగ్రవాదం ముప్పు తీవ్రంగా ఉందన్న మాజీ ప్రధాని
- తిరిగి వచ్చే విషయంపై ప్రభుత్వాలతో చర్చలు జరపలేదని వెల్లడి



2లో

కామరాజర్ టిఫిన్ స్కీమ్

విద్యార్థులతో కలిసి తిన్న విజయ్

- తమిళనాడులో 8వ తరగతి వరకు విస్తరించిన ఉచిత అల్పాహార పథకం
- 'పెరుంతలైవర్ కామరాజర్ బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్'గా పేరు మార్పు
- అదనంగా 15.3 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం
- పథకం మొత్తం బడ్జెట్‌ను సుమారు రూ. 724 కోట్లకు పెంచిన ప్రభుత్వం
- చెన్నైలో ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించిన



సీఎం విజయ్

తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందిస్తున్న ఉచిత అల్పాహార పథకాన్ని మరింత విస్తరిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటివరకు 1 నుంచి 5వ తరగతి వరకు అమలవుతున్న ఈ పథకాన్ని మంగళవారం నుంచి తరువాయి 2లో

జూరాల.. నీరెలా?

మహబూబ్ నగర్ : జూరాల రిజర్వాయర్‌లో నీటి నిల్వలు ఉన్నాయి. ఎగువ నుంచి వరద నీరు వస్తోంది. అయినా ఆయకట్టు పరిధిలో పంటలకు సాగునీటిని అధికారులు విడుదల చేయట్లేదు. కనీసం వారబంధీ పద్ధతిలోనైనా నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. జూరాలలో సరిపడా నీళ్లు ఉన్నప్పటికీ ఎల్‌నినో ప్రభావం వల్ల తాగునీటి అవసరాలకు సరిపోవనీ అందుకే పంట పొలాలకు సాగునీటిని వదలడం వీలుకాదని మంత్రి చేసిన ప్రకటన రైతుల్లో ఆందోళన పెంచింది. దీంతో రైతులు రోడ్డెక్కారు.సాగునీటిని విడుదల చేయాలని రాజకీయ పార్టీలు సైతం రైతుల పక్షాన ఆందోళనకు దిగాయి. జూరాల పరిధిలో రబీలో ఎప్పుడైనా చివరి ఆయకట్టుకు సాగునీటి సమస్య ఉంటుంది. అయితే, వర్షాకాలం పంటలకూ సాగు నీరు అందడం లేదు. వర్షాలు లేకపోయినా ఎగువ కర్నాటక నుంచి వరదలు వస్తుండటంతో జూరాలలో నీటి నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. వాటిని పంటలకు వదిలితే బాగుంటుందని రైతులు కోరుతున్నారు.

జూరాలలో నీళ్లున్నాయి..

అధికారిక లెక్కల ప్రకారం.. జూరాల రిజర్వాయర్ లో 8.05 టీఎంసీల నీటినిల్వ ఉంది. రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 8.15 టీఎంసీలు. ఇప్పటికీ పై నుంచి వరదలు వస్తూనే ఉన్నాయి. జూరాల ఆధారంగా 1.15 లక్షల ఎకరాల్లో వరి, మరో 50 వేల ఎకరాల్లో పత్తి, వేరుశనగ, మిర్చి పంటలను సాగు చేశారు. ప్రతి ఏటా ఖరీఫ్‌లో పూర్తిస్థాయి పంట వచ్చేది. రబీలో మాత్రం చివరి ఆయకట్టుకు సాగునీటి కష్టాలు ఏర్పడేవి. ఈ ఏడాది వర్షాకాలం మధ్యలోనే ఎల్ నినో ప్రభావంతో నీటి సమస్య ఏర్పడింది. జూరాల నీటిని సాగునీటికి వదిలితే రాబోయే వేసవిలో తాగునీటికి ఇబ్బందులు ఏర్పడతాయని ప్రభుత్వ పెద్దలు, అధికారులు చెబుతున్నారు. ఖరీఫ్ లో రైతులు పంటలు వేసుకునే ముందే ఎల్ నినో ప్రభావం ఏడాదంతా ఉంటుందని అధికారులకు తెలుసు. రైతులకు ముందస్తుగా సమాచారం ఇచ్చి అవగాహన కలిపిస్తే వరి సాగు చేసుకునే వారు కాదేమో. విత్తనాలు ఇచ్చి, ఎరువులు సరఫరా చేసి వంద శాతం పెట్టుబడి పెట్టిన తర్వాత ఇప్పుడు నీళ్లు ఇవ్వలేమంటే ఎక్కడికి పోతామని రైతులు అంటున్నారు.

వార బంధీ.. రైతుల రందీ

జూరాల రిజర్వాయర్ కింద ప్రతి ఏటా యాసంగిలో వార బంధీ ప్రకటిస్తారు. ఈ పద్ధతిలో వారానికి ఒకసారి సాగునీటిని వదులుతారు. ఈ విధానం ద్వారా ఆరుతడి పంటలు పండుతాయి. అయితే ఈ ఏడాది ఖరీఫ్ లోనే వారబంధీ అమలు చేసే పరిస్థితులు దాపురించాయి.వరి పైరుకు వారబంధీ పద్ధతిలో నీటి తడులు పెడితే దిగుబడులు రావు. పైగా పైర్లు ఎండిపోతాయి. అయితే ఆ వారబంధీ కూడా అమలు చేయడం లేదు. 15 రోజుల క్రితం వారబంధీ పద్ధతిలో నీటిని వదులుతామని చెప్పారు. కానీ ఇప్పటివరకు నీటిని వదలడానికి అధికారులు సిద్ధపడట్లేదు.

నీటి కోసం రాజకీయ పార్టీల ఆందోళన

జూరాల ఆయకట్టు రైతులకు భరోసా ఇస్తూ సీపీఐ(ఎం), ప్రజాసంఘాలు, బీఆర్ఎస్, రైతు సంఘాలు అన్నదాత పక్షాన నిలబడి సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. రెండు రోజుల కిందట రైతులే స్వయంగా జూరాల ఎడమ కాల్వ గేట్లు తెరిచి వీటిని వదిలారు. రైతులకు సీపీఐ(ఎం) వివిధ రాజకీయ పార్టీలు అండగా నిలిచాయి. అయితే రాత్రికి రాత్రే పోలీసుల రక్షణతో వెళ్లిన అధికారులు తెరిచిన గెట్లను మూసి వేశారు.

* **జూరాలను సాగునీటి కోసమే నిర్మించారు : లక్ష్మయ్య, రైతు, నందిమల్ల, వనపర్తి జిల్లా**

జూరాలను సాగునీటి కోసమే నిర్మించారు. తాగునీటి కోసం ఇతరత్రా వనరులు ఉపయోగించుకోవాలి. అంతే తప్ప సాగు నీటిని వదిలేసి తాగునీటి కోసమని పంటలకు వదలకపోవడం సరికాదు.

మోగిన ఎన్నికల నగారా

న్యూఢిల్లీ బ్యూరో : ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్ , పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో ఎన్నికల నగారా మోగింది. రాజ్యసభలో ఖాళీ కానున్న 12 స్థానాలకు కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. ఉత్తర్‌ప్రదేశ్‌లో 10 స్థానాలు, ఉత్తరాఖండ్‌లో ఒకటి, పశ్చిమ బెంగాల్‌లో ఒక స్థానానికి అక్టోబర్ 16న ఉప ఎన్నికలు జరగనున్నాయి. అదే రోజు ఓట్ల లెక్కింపు కూడా చేపట్టనున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది.

సెప్టెంబర్ 29న నోటిఫికేషన్

ఈ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ సెప్టెంబర్ 29న విడుదల కానుంది. నామినేషన్ల దాఖలుకు అక్టోబర్ 6 చివరి తేదీగా ఈసీ నిర్ణయించింది. అక్టోబర్ 7న నామినేషన్ల పరిశీలన చేపట్టనున్నారు. నామినేషన్లను ఉపసంహరించుకునేందుకు అక్టోబర్ 9 వరకు గడువు ఇచ్చారు. అక్టోబర్ 16న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. మొత్తం ఎన్నికల ప్రక్రియను అక్టోబర్ 19లోపు పూర్తి చేయాలని ఈసీ నిర్ణయించింది. రాజ్యసభ ఎన్నికల్లో బ్యాలెట్‌పై ప్రాధాన్యం గుర్తులను నమోదు చేసేందుకు రిటర్నింగ్ అధికారి అందించే నిర్దిష్ట వైలెట్ రంగు స్కెచ్ పెన్‌ను మాత్రమే ఉపయోగించాలని ఈసీ స్పష్టం చేసింది. ఇతర పెన్నులతో గుర్తులు వేయకూడదని పేర్కొంది. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా పరిశీలకులను నియమించి, మొత్తం ప్రక్రియను పర్యవేక్షించనున్నట్లు తెలిపింది. నవంబర్ 25తో కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి సహా పలువురు రాజ్యసభ సభ్యుల పదవీకాలం ముగియనుంది. వీరిలో ఉత్తరప్రదేశ్ నుంచి బీజేపీ నాయకులు అరుణ్ సింగ్, గీతా షాక్య, నీరజ్ శేఖర్, బ్రిజ్‌లాల్, బీఎల్ వర్మ, సీమా ద్వివేది, ఎస్పీ నేత రామ్ గోపాల్ యాదవ్, బీఎస్పీకి చెందిన రామ్జీ గౌతమ్ ఉన్నారు.

అమెరికాకు ఇరాన్ ఆఫర్

తగ్గిన క్రూడాయిల్ ధరలు

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల వేళ ఇరాన్ కీలక ప్రతిపాదన చేసింది. అమెరికా సైనిక ఒత్తిడిని తగ్గించి, దిగ్బంధనాన్ని ఎత్తివేస్తే ఏడు రోజుల్లో హర్మూజ్ జలసంధిని తెరిచేందుకు సిద్ధమని తెలిపింది. ఈ విషయాన్ని ఓ సీనియర్ ఇరాన్ అధికారి వెల్లడించినట్లు రాయిటర్స్ తెలిపింది. మధ్యవర్తుల ద్వారా ఈ ప్రతిపాదనను అమెరికాకు చేరవేసినట్లు సమాచారం. అమెరికాతో చర్చలను తిరిగి ప్రారంభించేందుకు ఇరాన్ సిద్ధంగా ఉన్నట్లు ఈ ప్రతిపాదనతో సంకేతాలు ఇచ్చింది. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సందర్భంగా న్యూయార్క్‌లో మధ్యవర్తి దేశాలతో ఈ అంశంపై చర్చించాలని టెహ్రాన్ భావిస్తోంది. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య భేటీ ఉండబోదని ఇరాన్ అధికారి తెలిపారు. అయితే అమెరికా నిబద్ధత చూపితే ఒప్పందం దిశగా వెళ్లే అవకాశం ఉందన్నారు. హర్మూజ్ జలసంధికి సంబంధించిన సైనిక చర్యలను అమెరికా నిలిపివేయాలని ఇరాన్ కోరుతోంది. అమెరికా సైనిక ఒత్తిడిని తగ్గించి, ఇరాన్ పోర్టులపై ఆంక్షలు ఎత్తివేస్తే జలసంధిని తిరిగి తెరిచి చర్చలను కొనసాగిస్తామని టెహ్రాన్ చెబుతోంది. పోర్టులపై ఆంక్షలు ఇరాన్ ముడిచమురు ఎగుమతులు, సముద్ర రవాణాపై ప్రభావం చూపుతున్నాయి. చర్చలను పునరుద్ధరించేందుకు ఇరాన్ గతంలో ఏడు షరతులను కూడా వెల్లడించింది. హర్మూజ్ జలసంధి త్వరలో తెరుచుకునే అవకాశం ఉందన్న వార్తలతో అంతర్జాతీయ చమురు ధరలు తగ్గాయి. బ్యారెల్ చమురు ధర 99 డాలర్ల దిగువకు పడిపోయింది. బ్రెంట్ క్రూడ్ ధర సెషన్ గరిష్ఠ స్థాయి నుంచి 3.5 శాతానికి పైగా తగ్గగా, వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ 2.25 శాతం పడిపోయింది. హర్మూజ్ ద్వారా ముడిచమురు సరఫరాలో అంతరాయాలపై ఆందోళనలు తగ్గడంతో ధరలు దిగివచ్చాయి.

అమెరికాలో 90 అడుగుల

హనుమాన్ విగ్రహ వివాదం

అమెరికాలోని టెక్సాస్‌లో ప్రతిష్ఠించిన 90 అడుగుల భారీ హనుమాన్ విగ్రహం ఇప్పుడు రాజకీయ, మతపరమైన వివాదానికి కేంద్రంగా మారింది. ఈ విగ్రహాన్ని కూల్చేస్తామంటూ ఓ కన్జర్వేటివ్ యూట్యూబర్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపాయి. ఇది హిందూ మతంపై జరిగిన దాడిగా అక్కడి హిందూ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. వివరాల్లోకి వెళితే.. టెక్సాస్‌లోని షుగర్ ల్యాండ్‌లో ఉన్న శ్రీ అష్టలక్ష్మి ఆలయ ప్రాంగణంలో ఈ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దీనిపై కన్జర్వేటివ్ యూట్యూబర్ జెస్సీ హ్యూస్ సోషల్ మీడియాలో స్పందిస్తూ.. "మేము గెలిచినప్పుడు ఈ విగ్రహాన్ని కూల్చేస్తాం" అని పోస్ట్ చేశారు. ఈ వ్యాఖ్య తీవ్ర దుమారం రేపడంతో పాటు అమెరికాలోని హిందూ సమాజం నుంచి బలమైన ప్రతిస్పందన వచ్చింది. జెస్సీ వ్యాఖ్యలపై అమెరికా సైన్యంలో పనిచేసిన రుచిర్ బక్షీ తీవ్రంగా స్పందించారు. ఇది హిందూ మతంపై జరిగిన దాడి అని, దేశభక్తి లేని చర్య అని ఆయన మండిపడ్డారు. కోయలిషన్ ఆఫ్ హిందూస్ ఆఫ్ నార్త్ అమెరికా (CoHNA) వంటి సంస్థలతో పాటు ఇతర సైనికోద్యోగులు కూడా హిందూ సమాజానికి మద్దతుగా నిలిచారు. తమ ప్రార్థనా స్థలాలను కాపాడుకునే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని స్పష్టం చేశారు. ఈ ఏడాది 2024 ఆగస్టులో 'స్టాట్యూ ఆఫ్ యూనియన్' పేరుతో ఈ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఇది అమెరికాలోనే అత్యంత ఎత్తైన హనుమాన్ విగ్రహాల్లో ఒకటి. అయితే, విగ్రహ ఏర్పాటు నుంచే కొందరు క్రిస్టియన్ కన్జర్వేటివ్‌లు దీనిని 'క్రైస్తవ వ్యతిరేకం' అని, 'దొంగ దేవుడు' అని విమర్శిస్తున్నారు. టెక్సాస్‌లో జరగనున్న మధ్యంతర ఎన్నికల నేపథ్యంలో ఈ వివాదం ప్రాధాన్యం సంతరించుకుంది. వలసలు, సాంస్కృతిక గుర్తింపు వంటి అంశాలపై జరుగుతున్న విస్తృత చర్చకు ఇది అద్దం పడుతోంది. టెక్సాస్‌లో భారతీయ అమెరికన్ల జనాభా గణనీయంగా ఉండటం కూడా ఈ వివాదానికి రాజకీయ రంగు పులుముతోంది. ఈ వివాదంపై ఆలయ అధికారులు స్పందిస్తూ, ఈ విగ్రహం తమ ప్రైవేట్ ఆస్తిలో ఉందని, ఇది స్థానిక హిందూ సమాజం భక్తికి, ఐక్యతకు చిహ్నమని వారు వివరించారు.

దేశంలోనే భారీ రియల్ ఎస్టేట్ డీల్.. రూ. 711 కోట్లతో భవనం కొనుగోలు

దేశ ఆర్థిక రాజధాని ముంబైలో దేశంలోనే అతిపెద్ద రెసిడెన్షియల్ ప్రాపర్టీ డీల్ నమోదైంది. ప్రముఖ స్టాక్ బ్రోకింగ్ సంస్థ 'ఏంజెల్ వన్' వ్యవస్థాపకుడు దినేష్ ఠక్కర్, సముద్ర తీరానికి అభిముఖంగా ఉన్న ఒక విలాసవంతమైన భవనాన్ని రూ. 711 కోట్లకు కొనుగోలు చేశారు. భారతదేశ చరిత్రలో ఒకే నివాస ఆస్తికి సంబంధించి జరిగిన అత్యంత ఖరీదైన లావాదేవీ ఇదే కావడం విశేషం. ముంబైలోని అత్యంత ఖరీదైన ప్రాంతంలో ఉన్న ఈ ఎనిమిది అంతస్తుల భవనం సుమారు 63,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంది. దీనిని ప్రముఖ నిర్మాణ సంస్థ 'ఎంబసీ డెవలప్‌మెంట్స్ లిమిటెడ్' నిర్మించింది. ఈ భారీ డీల్ వార్త వెలువడిన వెంటనే, స్టాక్ మార్కెట్‌లో ఎంబసీ డెవలప్‌మెంట్స్ షేర్లు 8.3 శాతం మేర వృద్ధిని నమోదు చేశాయి. ఈ లావాదేవీ ముంబైతో పాటు దేశవ్యాప్తంగా అల్ట్రా లగ్జరీ రియల్ ఎస్టేట్ మార్కెట్‌కు ఉన్న బలమైన డిమాండ్‌ను ప్రతిబింబిస్తోంది. ఇటీవల కాలంలో ఇటువంటి భారీ కొనుగోళ్లు పలుమార్లు చోటుచేసుకున్నాయి. గతంలో యూఎస్‌వీ ఛైర్‌పర్సన్ లీనా గాంధీ తివారీ రూ.639 కోట్లతో ఒక అపార్ట్‌మెంట్‌ను కొనుగోలు చేయగా, ప్రముఖ బ్యాంకర్ ఉదయ్ కోటక్, ఆయన కుటుంబ సభ్యులు రూ.400 కోట్లకు పైగా విలువైన సీఫేసింగ్ టవర్‌ను సొంతం చేసుకున్నారు. ప్రాపర్టీ డేటా విశ్లేషణ సంస్థ జాప్‌కీ ప్రకారం, జనవరి 2025 నుంచి ఇప్పటివరకు దేశంలో రూ.100 కోట్లకు పైగా విలువైన 37 రెసిడెన్షియల్ డీల్స్ జరిగాయి.

ట్రంప్ పక్షాన నిలిచినా.. తప్పని అవమానాలు!

అమెరికాలో డొనాల్డ్ ట్రంప్, ఆయన 'మాగా' (మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్) ఉద్యమానికి గట్టి మద్దతుదారులుగా ఉన్న భారత సంతతి కన్జర్వేటివ్‌లకు ప్రస్తుతం అనూహ్య అనుభవాలు ఎదురవుతున్నాయి. తమ భావజాలం తమను అమెరికన్‌లుగా పూర్తిస్థాయిలో గుర్తిస్తుందని వారు భావిస్తున్నప్పటికీ, వారిలో కొందరు సొంత పార్టీ నుంచే జాత్యహంకార వ్యాఖ్యలను, వివక్షను ఎదుర్కోవడం చర్చనీయాంశంగా మారింది. ట్రంప్ రాజకీయాల్లో భావజాలానికే ప్రాధాన్యత ఉంటుందని, జాతి, మూలాలకు తావుండదని చాలా మంది భారతీయ అమెరికన్లు విశ్వసించారు. అయితే, ఇటీవలి పరిణామాలు దీనికి భిన్నంగా ఉన్నాయి. వారు భావజాల పరంగా తమ నిబద్ధతను చాటుకున్నప్పటికీ, "మీరు ఎంతవరకు అమెరికన్లు?" అనే ప్రశ్నలను ఎదుర్కోవాల్సి వస్తోందని ప్రముఖ కాలమిస్ట్ చిదానంద్ రాజఘట్ట తన కథనంలో విశ్లేషించారు. ట్రంప్ ప్రభుత్వంలో పనిచేస్తున్న చండీగఢ్ మూలాలున్న హర్మీత్ ధిల్లాన్, తనను తాను అమెరికన్‌గా చాటుకునేందుకు బీఫ్ డిన్నర్ ఫొటో పోస్ట్ చేశారు. దీనిపై 'మాగా' మద్దతుదారులే ఆమెను ఎగతాళి చేశారు. తనను 'పేపర్‌వర్క్ అమెరికన్' అంటూ రోజూ జాత్యహంకార వ్యాఖ్యలు ఎదుర్కొంటున్నానని ఆమె స్వయంగా తెలిపారు. అలాగే, దినేశ్ డిసౌజా తన కుమార్తెపై వచ్చిన జాతి వివక్ష దాడిని తిప్పికొట్టేందుకు, ఆమె తల్లి శ్వేతజాతీయురాలని చెప్పాల్సి రావడం విమర్శలకు దారితీసింది. గతంలో వివేక్ రామస్వామి, నిక్కీ హేలీ వంటి వారు కూడా తమ అమెరికన్ గుర్తింపును నిరూపించుకోవడానికి ప్రయత్నించాల్సి వచ్చింది. సాధారణంగా ప్రగతిశీల భావాజాలం కలిగిన ప్రమీలా జయపాల్ వంటి నేతలు 'మీ దేశానికి తిరిగి వెళ్లండి' వంటి విమర్శలను మొదటి నుంచీ ఎదుర్కొంటున్నారు. అయితే, ఇప్పుడు ట్రంప్ వాదాన్ని అత్యంత బలంగా వినిపిస్తున్న కన్జర్వేటివ్‌లు సైతం అదే వర్గం నుంచి ఇటువంటి వివక్షను ఎదుర్కోవడం గమనార్హం.

జైలుకైనా సిద్ధం.. డిసెంబర్‌లో స్వదేశానికి షేక్ హసీనా

బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనా కీలక ప్రకటన చేశారు. 2026 డిసెంబర్ నాటికి తాను తప్పకుండా స్వదేశానికి తిరిగి వెళ్తానని ఆమె స్పష్టం చేశారు. తాను ఎప్పుడు వెళతాననే దానికంటే, ఏ విధంగా వెళతాననేదే అత్యంత ప్రధానమని ఆమె వ్యాఖ్యానించారు. ఒక ఆంగ్ల వార్తా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో హసీనా ఈ విషయాలను వెల్లడించారు. తన పునరాగమనం శాంతియుత మార్గంలో, చట్టబద్ధంగానే ఉండాలని తాను ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. 2025 నవంబర్‌లో బంగ్లాదేశ్ ట్రిబ్యునల్ తనకు మరణశిక్ష విధించడాన్ని హసీనా తీవ్రంగా ఖండించారు. అది పూర్తిగా రాజకీయ ప్రేరేపితమని, అన్యాయమైన తీర్పు అని ఆమె ఆరోపించారు. తన నిష్క్రమణ అనంతరం కొలువుదీరిన ప్రస్తుత ప్రభుత్వాన్ని రాజ్యాంగ విరుద్ధమైనదిగా, తనపై జరుగుతున్న విచారణను ఒక ప్రహసనంగా ఆమె అభివర్ణించారు. తన రాజకీయ పోరాటంలో భాగంగా జైలుకు వెళ్లేందుకైనా తాను సిద్ధంగా ఉన్నానని ఈ సందర్భంగా ఆమె తేల్చిచెప్పారు. ప్రస్తుతం రాజకీయ కార్యకలాపాలపై నిషేధం ఎదుర్కొంటున్న తన 'అవామీ లీగ్' పార్టీని పునర్నిర్మించడం, పార్టీ శ్రేణులతో సంబంధాలను తిరిగి బలోపేతం చేసుకోవడంపై దృష్టి సారిస్తానని హసీనా వివరించారు. బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య పాలనను పునరుద్ధరించడమే తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో ఉగ్రవాద, తీవ్రవాద శక్తుల నుంచి ముప్పు పొంచి ఉందని, ఇది కేవలం ఆ దేశ అంతర్గత సమస్య మాత్రమే కాదని, ఒక తీవ్రమైన ప్రాంతీయ ముప్పు అని ఆమె హెచ్చరించారు. అయితే, తన పునరాగమన ప్రణాళికలకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా ఖరారు కాలేదని ఆమె వెల్లడించారు. ఈ విషయంపై బంగ్లాదేశ్ లేదా భారత ప్రభుత్వాలతో తాను ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక లేదా అనధికారిక చర్చలు జరపలేదని హసీనా స్పష్టం చేశారు.

కామరాజర్ టిఫిన్ స్కీమ్.. విద్యార్థులతో కలిసి తిన్న విజయ్

తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందిస్తున్న ఉచిత అల్పాహార పథకాన్ని మరింత విస్తరిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటివరకు 1 నుంచి 5వ తరగతి వరకు అమలవుతున్న ఈ పథకాన్ని మంగళవారం నుంచి 6, 7, 8 తరగతుల విద్యార్థులకు కూడా వర్తింపజేశారు. ఈ సందర్భంగా పథకం పేరును 'ముఖ్యమంత్రి అల్పాహార పథకం' నుంచి తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, విద్యా సంస్కరణల ప్రదాత అయిన 'పెరుంతలైవర్ కామరాజర్ అల్పాహార పథకం'గా మారుస్తున్నట్లు ప్రకటించారు. చెన్నైలోని తిరువాన్మియూర్‌లో ఉన్న ఓ ప్రభుత్వ పాఠశాలలో సీఎం విజయ్ ఈ విస్తరణ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా విద్యార్థులకు అల్పాహారం వడ్డించి, వారితో కలిసి కూర్చొని భోజనం చేశారు. ఈ విస్తరణ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 15,454 ప్రభుత్వ, ప్రభుత్వఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 15.3 లక్షల మంది విద్యార్థులు అదనంగా లబ్ధి పొందనున్నారు. ఈ పథకం కింద మొత్తం ప్రయోజనం పొందేవారి సంఖ్య 34.64 లక్షలకు చేరనుంది. పథకం విస్తరణ కోసం ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం అదనంగా రూ. 217.63 కోట్లను కేటాయించింది. దీంతో ఈ పథకం మొత్తం వార్షిక బడ్జెట్ సుమారు రూ. 724 కోట్లకు పెరిగింది. వాస్తవానికి ఈ అల్పాహార పథకాన్ని 2022లో గత డీఎంకే ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా ఉన్న ఎం.కె. స్టాలిన్ ప్రాథమిక తరగతుల కోసం ప్రారంభించారు. ఇప్పుడు విజయ్ నేతృత్వంలోని కొత్త ప్రభుత్వం ఈ పథకాన్ని కొనసాగించడమే కాకుండా, దాని పరిధిని పెంచి దివంగత నేత కామరాజర్ పేరు పెట్టడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం అమలు ప్రారంభమైనప్పటికీ, కొన్ని జిల్లాల్లో ఉపఎన్నికల కారణంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో అక్కడ తాత్కాలికంగా వాయిదా వేశారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి ఆద్యుడిగా పేరుగాంచిన కామరాజర్ పేరును ఈ పథకానికి పెట్టడం ద్వారా ఆయన వారసత్వాన్ని గౌరవించినట్లయిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఎస్సీ, ఎస్టీ బాధితే కుటుంబాలకు సత్వరే న్యాయం

హైదరాబాద్ : ఎస్సీ, ఎస్టీలపై అట్రాసిటీ కేసుల్లో బాధిత కుటుంబాలకు సత్వర న్యాయం చేయాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం-1989 అమలుపై రాష్ట్రస్థాయి ఉన్నత నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్రంలో చట్టం అమలు, నమోదైన కేసులు, దర్యాప్తు పురోగతి, న్యాయస్థానాల్లో విచారణ, కేసుల పరిష్కారం, బాధితులకు అందుతున్న ఆర్థిక సహాయం, పునరావాస చర్యలను ఈ సందర్భంగా సీఎం సమీక్షించారు. కేసుల విచారణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక న్యాయస్థానాలు, మొబైల్ కోర్టుల పని తీరుతో పాటు చట్టంపై చేపడుతున్న అవగాహన కార్యక్రమాలపై సమావేశంలో చర్చించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2013 ఫిబ్రవరి 11న అప్పటి ముఖ్యమంత్రి అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ నిరోధక చట్టం అమలుపై రాష్ట్ర స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం ముఖ్యమంత్రి అధ్యక్షతన రాష్ట్ర స్థాయి ఉన్నత నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం జరగడం ఇదే తొలిసారి.ఈ సందర్భంగా రాష్ట్రంలో క్రమంగా ఐదేండ్లలో ఎస్సీ, ఎస్టీలపై అట్రాసిటీ కేసులు తగ్గుముఖం పట్టాయని అధికారులు సీఎంకు వివరించారు. రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో, ప్రధానంగా 73 గ్రామాల్లో ఎక్కువ కేసులు నమోదవుతున్నాయని నివేదించారు. అక్కడ పోలీసు విభాగం ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన అవసరముందని తెలిపారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీల సమావేశాలు క్రమం తప్పకుండా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ నిరోధక చట్టం కింద బాధితులకు చెల్లించాల్సిన నష్ట పరిహారాన్ని వెంటనే చెల్లించాలని వారికి సూచించారు. అందుకు అవసరమైన నిధులను బడ్జెట్ కేటాయింపులతో ముడిపెట్టకుండా గ్రీన్ ఛానెల్ ద్వారా విడుదల చేయాలన్నారు. అట్రాసిటీ ఘటనల్లో బాధితుల పట్ల ప్రభుత్వం మానవీయ కోణంలో స్పందించాలని, వారికి సకాలంలో నష్టపరిహారం, సహాయం, పునరావాసం అందేలా చూడాలని స్పష్టం చేశారు.

జర్నలిస్టుల జేఏసీ బలోపేతానికి కృషి చేస్తా

*** నూతన జిల్లా అధ్యక్షులు తక్కెళ్ళపల్లి శ్రీనివాస్**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: జర్నలిస్టుల సంక్షేమం,హక్కుల సాధనే లక్ష్యంగా పనిచేస్తానని తెలంగాణ జర్నలిస్టుల జాయింట్ యాక్షన్ కమిటీ (టీజేఏసీ) నూతన జిల్లా అధ్యక్షుడు తక్కెళ్లపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా తక్కెళ్లపల్లి శ్రీనివాస్ ను నియమిస్తూ, రాష్ట్ర అధ్యక్షులు తొగరి కరుణాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల గణేష్ నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర నాయకత్వం మాట్లాడుతూ,జేఏసీ నియమ, నిబంధనలను పాటిస్తూ, క్రమశిక్షణతో ముందుకు సాగాలని, జిల్లాలో తదుపరి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది.అనంతరం నూతన జిల్లా అధ్యక్షుడు తక్కెళ్లపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ,తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు కరుణాకర్ కు, ప్రధాన కార్యదర్శి గణేష్ కు కృతజ్ఞతలు తెలిపారు.రాష్ట్ర, జిల్లా నాయకత్వం సూచనలు, సలహాల మేరకు జర్నలిస్టుల సమస్యల సాధనకై నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. నూతనంగా నియమితులైన శ్రీనివాస్ ను జిల్లా జర్నలిస్టు మిత్రులు, ప్రజా సంఘాల నాయకులు అభినందనలు తెలియజేశారు.

శ్రీ వినాయక ఉత్సవ కమిటీ సభ్యులకు టీ షర్టుల పంపిణీ



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : వినాయక నవరాత్రి ఉత్సవాలను గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో,ఐకమత్యంతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కాంగ్రెస్ పార్టీ కేసముద్రం మండల అధ్యక్షుడు సమ్మయ్య గౌడ్ పిలుపునిచ్చారు.కేసముద్రం గ్రామంలోని శ్రీ వినాయక ఉత్సవ కమిటీ సభ్యులకు గురువారం తన సొంత ఖర్చులతో 40 టీషర్టులను ఆయన అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,పండుగల నిర్వహణలో యువత చూపుతున్న చొరవ అభినందనీయమన్నారు. ఉత్సవాల విజయవంతానికి, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వినాయక ఉత్సవ కమిటీ ప్రతినిధులు, సభ్యులు,స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సహజ వ్యవసాయంతో రైతులకు మేలు :జ్యోతి రెడ్డి



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి; రైతులు రసాయన ఎరువులు, పురుగు మందులపై అధికంగా ఆధారపడకుండా సహజ వ్యవసాయ పద్ధతులను అవలంబించి, తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు సాధించేలా ప్రోత్సహించేందుకు జ్యోతి రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నార్కట్పల్లిలో సహజ వ్యవసాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా. జ్యోతి రెడ్డి దుడ్లిపాల, కర్నాటి వెంకన్న, ఏవో. గౌతమ్, ఏ ఈ ఓ శిరీష, తదితరులు పాల్గొని రైతులకు సహజ వ్యవసాయం ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భం గా రైతులకు సహజ వ్యవసాయం, నేల ఆరోగ్యం, సేంద్రియ ఎరువుల వినియోగం, దేశీ ఆవు ఆధారిత వ్యవసాయ పద్ధతులు, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు రసాయన ఆధారిత వ్యవసాయంతో పెరుగుతున్న సాగు ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు, నేల సహజ సారాన్ని కాపాడుకోవడానికి సహజ వ్యవసాయ పద్ధతులు ఉపయోగపడతాయని నిర్వాహకులు వివరించారు. జ్యోతి రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు సేంద్రియ ఎరువును పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా రైతుల్లో సహజ వ్యవసాయంపై అవగాహన పెంచడంతో పాటు, ఆరోగ్యకరమైన నేల ఆరోగ్యకరమైన పంట ఆరోగ్యకరమైన సమాజంఅనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు. నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో, రైతులు స్థానిక ప్రజలు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

చెట్లను పెంచుతే పచ్చదనంతో ప్రాణం పోస్తే వాయువునిస్తాయి


*** వెంకమ్మగూడ సర్పంచ్ గొర్లపల్లి అశోక్**



ప్రజాస్ఫూర్తి, షాద్ నగర్ : వెంకమ్మగూడ గ్రామంలో వున్న ప్రాథమిక పాఠశాలలో, ప్రధానోపాధ్యాయులు మహేశ్వరి టీచర్ ఆధ్వర్యంలో ప్రకృతి వనంలో విద్యార్థులు,స్థానిక నాయకులతో కలిసి సర్పంచ్ మొక్కలు నాటారు.చెట్లను పెంచుతే పచ్చదనంతో నీడనిచ్చి, మనకు ప్రాణం పోసే స్వచ్ఛమైన వాయువునిస్తాయి అని సర్పంచ్ గొర్లపల్లి అశోక్ గారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వడ్డె యాదగిరి, వార్డ్ సభ్యులు తీగపురం సునీత రాజు, గొర్లపల్లి స్వప్న విజయ్ కుమార్, మాజీ వార్డ్ సభ్యులు వడ్డె శ్రీను,గ్రామ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కుమ్మరి సామూల్య, కుమ్మరి రాజు, అంగన్వాడీ ఉపాధ్యాయురాలు మణెమ్మా, మహేష్,రాజు, చంద్రశేఖర్, విద్యార్థులు మరియు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆయుర్వేద దినోత్సవం వేడుకలు

*** ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో ఆయుర్వేద దినోత్సవం**



ప్రజా స్ఫూర్తి,కూసుమంచి: ఈ నెల 23న తేదీన ఆయుర్వేద దినోత్సవం పురస్కరించుకొని ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో మొదటి రోజైన 21వ తేదీన వయో వృద్ధులకు ఆరోగ్య కరమైన ఆహారాలపై అవగాహన, అంగన్వాడీ కేంద్రం లో చిన్నారుల ఆరోగ్య పదార్థాలపై పోషణ అభియాన్ అవగాహన, రెండో రోజు ఈనెల 22వ తేదీన పి హెచ్ సి నుంచి యోగా వాక్, ప్రాథమిక పాఠశాల లో చిన్నారులకు యోగా ధ్యానం చేయించి అవగాహన కల్పించామని, మూడవ రోజైన ఆయుర్వేద దినోత్సవం రోజు ఆయుర్వేద సృష్టికర్త ధన్వంతరి చిత్ర పటానికి పూలమాలలు వేసి పూజ, ఆయుర్వేద వైద్యం పై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ హోమియో వైద్యశాల వైద్యురాలు డా. పోరిక జ్యోతి, పి హెచ్ సి వైద్యుడు డా. సాయి కుమార్ పేర్కొన్నారు. ఆయుష్ విభాగం నందు ఆయుర్వేదం, యోగ, యునాని, సిద్ధ, హోమియో అంతర్భాగాలని తెలిపారు. అన్ని రకాల వ్యాధులకు వైద్యం అందించబడుతుందని, ఆయుర్వేదం, యోగ అనేవి సంపూర్ణ ఆరోగ్యం కోసం ఎంతో దోహద పడతాయని తెలిపారు. ఈ క్రమంలో మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి యోగా వాక్ నిర్వహించామని, అనంతరం అంగన్వాడీకేంద్రం లోచిన్నారులకు యోగా సంబంధిత అవగాహన తో పాటు విద్యార్థులతో యోగా చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యోగ శిక్షకురాలు మాధవి, సిబ్బంది సీ హెచ్ ఓ వలీ, స్టాఫ్ నర్సులు షాజిద, మహేశ్వరి, కిరణ్ కుమార్, అయితరాజు రామకృష్ణ, వాస రాధాకుమారి, ఏ ఎన్ ఎం లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.


సీనియర్ సిటిజన్స్ సేవలు అభినందనయం

*** ఉప సర్పంచ్ వాసిరెడ్డి మురళి**



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం : చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీ లో సీనియర్ సిటిజన్స్ కార్యాలయం నందు 11వ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా సీనియర్ సిటిజన్స్ అధ్యక్షులు కొల్లు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆయుర్వేద వైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విద్యానగర్ కాలనీ గ్రామ ఉప సర్పంచ్ వాసిరెడ్డి మురళి పాల్గొని ఆయన మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని , వారి సేవలు అభినందనీయమని ఆయన అన్నారు . అనంతరం మెడికల్ ఆఫీసర్ ఉషారాణి , ఆయుర్వేదిక్ హాస్పిటల్ మొరం పల్లి బంజర డాక్టర్ జయ సీనియర్స్ కు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు . అనంతరం యోగా ఇన్స్ట్రక్టర్ కమలారాణి పేషెంట్లకు యోగాసనాలు గురించి వాటి ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘ సెక్రటరీ సురేష్ బాబు , ఫార్మసిస్ట్ రామకృష్ణ, ఎస్.ఎన్.ఓ వి. దిద్దుబాబు, ఆశా వర్కర్లు, నర్సింగ్ స్టూడెంట్స్ పాల్గొన్నారు .

అనుమతి లేకుండా పార్క్ లో కందకాలపై అధికారులకు ఫిర్యాదు



మహబూబాబాద్,ప్రజాస్ఫూర్తి: హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం, గాంధీ పార్క్ అభివృద్ధికి తక్షణ చర్యలు తీసుకోవాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారథి రెడ్డి కోరారు.1998లో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల కాపీని మున్సిపల్ డీఈ సీహెచ్. ఉపేందర్ కు ఆయన అందజేశారు.గాంధీ పార్క్ అన్ని కార్యక్రమాలకు బహిరంగ వేదికగా ఉందని,పబ్లిక్ సిట్టింగ్ కెపాసిటీకి ఇబ్బంది లేకుండా,విశాలమైన వేదిక, లైటింగ్,గ్రీనరీ,వాకింగ్ ట్రాక్ తో అభివృద్ధి చేయాలని కోరారు.మున్సిపల్ తీర్మానం,టెండర్ ప్రక్రియ, శంకుస్థాపన లేకుండానే, ప్రైవేట్ వ్యక్తులు జేసీబీతో కందకాలు తవ్వడంపై ఆయన అధికారులను నిలదీశారు.దీనిపై డీఈ ఉపేందర్,ఏఈ కుమార్ లు తమకు సమాచారం లేదని, అనుమతి ఇవ్వలేదని తెలిపి, పనులను నిలుపుదల చేయించారు. శిథిలావస్థలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్, అసంపూర్తిగా ఉన్న అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ ను పూర్తి చేయాలని, ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళి నాయక్ ప్రకటించిన 50 లక్షలతో యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు. ఎ ఈ కుమార్,పడిదల కవిత,ఎస్.కె.యూసుఫ్, బిక్కిసాయి, నీలం వెంకటేశ్వర్లు, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తగా రోడ్డు పక్కన ఉన్న గుంత పూడ్చివేత



ప్రజాస్ఫూర్తి ,జన్నారం: పోనకల్ గ్రామ పంచాయతీ పరిధిలో రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న గుంతను గుర్తించి,దాని వల్ల ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా పొనకల్ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్ ఆధ్వర్యంలో మొరం పోసి పూడ్చివేశారు. రోడ్డు పక్కన ఉన్న ప్రమాదకరమైన గుంతపై కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ మంద రాజేష్ సర్పంచ్ దృష్టికి తీసుకువచ్చి, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అదే సమయంలో అక్కడ నిమజ్జన పనులు జరుగుతుండడంతో సర్పంచ్ వెంటనే స్పందించి, సంబంధిత సిబ్బందితో గుంతను మొరంతో పూడ్చివేయించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఈవో రాహుల్ , కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ మంద రాజేష్, ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం జరిగిందని గ్రామ పంచాయతీ సిబ్బంది తెలిపారు.


కన్ సాన్ పల్లి లో ఇరుముడి సినిమా సందడి

*** బిఆర్ఎస్ యువ నాయకుడు ధీరజ్ రెడ్డి ఆధ్వర్యంలో సినిమా ప్రదర్శన...**



అందోలు, ప్రజాస్ఫూర్తి : అందోల్ మండలంలోని కన్ సాన్ పల్లి గ్రామంలో ఇరుముడి సినిమా సందడి నెలకొంది. వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని సోమవారం రాత్రి బిఆర్ఎస్ యువ నాయకుడు సోమన్నగారి ధీరజ్ రెడ్డి ఆధ్వర్యంలో వినాయక ఉత్సవ కమిటీ సహకారంతో 'ఇరుముడి' మూవీని ప్రదర్శించారు. దుర్గా భవాని ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద మూవీ ప్రదర్శన చేశారు. గ్రామానికి చెందిన యువకులు, మహిళలు,పెద్దలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో హాజరై చిత్రాన్ని వీక్షించారు. భక్తి భావాన్ని పెంపొందించే ఉద్దేశంతో ఈ ప్రదర్శనను ఏర్పాటు చేసినట్లు ధీరజ్ రెడ్డి తెలిపారు. ఇలాంటి ఆధ్యాత్మికత, సామాజిక సందేశంతో కూడిన చిత్రాలను వీక్షించడం ద్వారా యువతలో భక్తిభావాన్ని, సన్మార్గాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. సినిమా ప్రదర్శనతో గ్రామంలో పండుగ సందడి నెలకొంది. సినిమాలోని తండ్రీకూతుళ్ల మధ్య అనుబంధం, అయ్యప్ప స్వామి దీక్ష చుట్టూ తిరిగే భక్తిరస అంశాలు కుటుంబ ప్రేక్షకులను ఎంతో ఆకట్టుకున్నాయి. గ్రామంలోనే వెండితెరపై సినిమాను ప్రదర్శించడం ఇక్కడ విశేషంగా మారింది. థియేటర్లకు వెళ్లలేకపోయిన ప్రేక్షకులు ఇలా తమ గ్రామాల్లోనే తమ ఊరి ప్రజలతో కలిసి సినిమా చూసే అవకాశం రావడం చాలా సంతోషంగా ఉంది అంటూ ఆనందం వ్యక్తం చేస్తూ ధీరజ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

జీళ్ళచెరువులో వినాయక విగ్రహం వద్ద ఎంపీడీవో పూజలు3



కూసుమంచి, ప్రజా స్ఫూర్తి : మండలంలోని జీళ్ళచెరువు గ్రామంలో బొడ్రాయి బజార్ లో శ్రీ వెంకటేశ్వర గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో జశ్వంత్ కుమార్, కార్యదర్శి రాజేష్ వినాయకుడికి పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఎంపీడీవో ప్రారంభించారు. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో విగ్రహ దాతలు అంబాల వెంకటేశ్వర్లుసత్యావతి, వినోద్ కుమార్, సీనియర్ జర్నలిస్ట్ పెండ్ర అంజయ్య, సభ్యులు ముద్రబోయిన వెంకటనారాయణ, వీరబాబు, సైదులు, మీరా, బెజవాడ శ్రీకాంత్, కొండా నగేష్, యాదగిరి పాల్గొన్నారు.

గడ్డెన్న వాగు ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన నిగ్వా గ్రామస్తులకు తగిన సహాయం అందిస్తాం

*** జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



ప్రజా స్ఫూర్తి, భైంసా: నిర్మల్ జిల్లా కుభీర్ మండలం నిగ్వా గ్రామంలో గడ్డెన్న వాగు ప్రాజెక్టు నిర్మాణం కారణంగా ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు వీలైనంత తొందరగా సహాయం అందిస్తామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మంగళవారం కుభీర్ మండలంలోని నిగ్వా గ్రామంలో గడ్డం వాగు ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన వారికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయడానికి ప్రాధాన్యత ఇస్తామని చేశారు. వారి సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. నిర్వాసితులకు ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియ నిలిచిపోయిన విషయాన్ని గుర్తించి, అన్ని రికార్డులను సమగ్రంగా తనిఖీ చేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని నిర్వాసితులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఎస్సీ కాలనీలో అక్కడి స్థానికులు తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వెంటనే స్పందించిన కలెక్టర్, గ్రామంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తక్షణమే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా అవసరమైన ప్రాంతాల్లో నూతనంగా బోర్‌వెల్స్ వేయించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం స్థానిక ఆలయంలో కలెక్టర్ పూజలు నిర్వహించారు.ఈ సమావేశంలో తహసిల్దార్ శ్రీదేవి, గ్రామ సర్పంచ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

యోగా ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలి

*** డీసీపీ రాజ మహేంద్ర నాయక్**

జనగామ,ప్రజాస్ఫూర్తి :11వ ఆయుర్వే ద దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జిల్లా కేంద్రంలో ఆయు ర్వేద వెల్‌నెస్-యోగా వాక్ నిర్వహిం చారు. నెహ్రూ పార్క్ వద్ద డీసీపీ రాజ మహేంద్ర నాయక్ పచ్చజెండా ఊపి వాక్‌ను ప్రారంభించారు. నెహ్రూ పార్క్ నుండి జిల్లా కలెక్టరేట్ వరకు సాగిన ర్యాలీలో పాల్గొన్న వారు ఆయుర్వేదం, యోగా, ఆరోగ్యకరమైన జీవనశైలి ప్రా ధాన్యతను వివరిస్తూ నినాదాలు చేశా రు. ఈ సందర్భంగా డీసీపీ రాజ మహేం ద్ర నాయక్ మాట్లాడుతూ ఆయుర్వేదం భారతీయ సనాతన వైద్య విధానమని, ఆరోగ్య పరిరక్షణలో ప్రకృతి ఆధారిత జీవనశైలి ఎంతో కీలకమని అన్నారు. డీ ఎంహెచ్ఓ వాణిశ్రీ మాట్లాడుతూ యో గా, ఆయుర్వేదంతో శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని తెలిపారు. సమతుల్య ఆహారం, నిత్య వ్యాయామం, యోగా, ఆయుర్వేద పద్ధ తులను ప్రజలు అలవర్చుకోవా ల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ మమత,డాక్టర్ సరిత, డీపీఎం కుమార్, వైద్యా ధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యక ర్తలు, విద్యార్థులు,ఆయుష్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 23 న ప్రభుత్వ టేకు కలప బహిరంగ వేలం



ప్రజాస్ఫూర్తి ,జన్నారం :జన్నారం ప్రభుత్వ కలప డిపోలో ఈ నెల 23 న టేకు కలప బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు అటవీ డివిజనల్ అధికారి రామ్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు.అటవీ శాఖ ఆధ్వర్యంలో జరగనున్న ఈ వేలంలో మొత్తం 182 కలప లాట్లు అందుబాటులో ఉన్నాయని, ఇందులో 45.449 ఘనపు మీటర్ల కలప ఉంది. ఇందులో టేకు 45 సీఎంటి, టేకుయేతర (గ్రే) కలప 3.4 సెంటీమీటర్లు విక్రయానికి ఉంచనున్నట్లు తెలిపారు. మన ప్రాంతానికి చెందిన నాణ్యమైన టేకు కలపను తక్కువ ధరకు కొనుగోలు చేసుకునే అరుదైన అవకాశమని, నిర్మాణ పనులు, ఫర్నిచర్ తయారీ, కలప ఆధారిత పరిశ్రమల అవసరాల కోసం కలప కొనుగోలు చేయదలచిన వ్యాపారులు, కొనుగోలుదారులు ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆరోగ్యం పై ఆయుష్ భరోసా.. నేడు మెగా వైద్య శిబిరం

జనగామ: జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు సెప్టెంబర్ 23న జనగామ మున్సిపల్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో మెగా ఆయుష్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ మమత మంగళవారం తెలిపారు.శిబిరంలో ఆయుర్వేద, హోమియోపతి, యునాని, యోగా వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

అన్నదానంతోనే సమాజంలో ఐక్యత, సేవాభావం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా, మహబూబాబాద్ పట్టణంలో అన్నదాన మహోత్సవం ఘనంగా కొనసాగింది. భక్తిశ్రద్ధలతో,ప్రశాంత వాతావరణంలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు పాల్గొని, సేవాభావాన్ని చాటుకున్నారు. పట్టణ కేంద్రంలోని 24వ వార్డు,12వ వార్డు,11వ వార్డులలో నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమాల్లో డీసీసీ అధ్యక్షురాలు ఉమా మురళి నాయక్, మహబూబాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్ నాయక్ దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొని,భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ వినోద్ కుమార్, మండల అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు బొల్లు రాజు,పద్మం ధనలక్ష్మి,ప్రవీణ్,సాల్వాయి దిలీప్,గాడిపెల్లి చరణ్,నాయకులు ఐశ్వర్య గోపీనాథ్,నిమ్మల శ్రీనివాస్,ఎడ్ల రమేష్,జిలుగుల భాస్కర్ యాదవ్, సుభాష్,గోనె శ్యామ్,సతీష్ రావు,చంటి,స్థానిక వార్డు నాయకులు,ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు,ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సమతుల్య ఆహారంతో ఆరోగ్యవంతమైన సమాజం



వలిగొండ, ప్రజాస్ఫూర్తి: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషక విలువలతో కూడిన సమతుల్య ఆహారాన్ని తీసుకోవడం ద్వారానే రక్తహీనతను నివారించి, ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని ఐసిడిఎస్ వలిగొండ సెక్టర్ సూపర్వైజర్ పారిజాత, వలిగొండ అంగన్వాడి టీచర్ బాలవిజయ అన్నారు. పోషణ మాసం ఉత్సవాల్లో భాగంగా వలిగొండ మండల కేంద్రంలోని అంగన్‌వాడీ 2 కేంద్రంలో మంగళవారం పోషకాహార అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాలు, మొలకెత్తిన గింజలు, గుడ్లతో ప్రత్యేక ఆహార ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఏయే ఆహార పదార్థాల్లో ఎలాంటి విటమిన్లు, పోషకాలు ఉంటాయో వివరించారు. పిల్లలు, గర్భిణీలు, బాలింతలు మంచి పోషక విలువలు ఉండే సమతుల ఆహారం ప్రతిరోజు తీసుకోవాలని, సమతుల ఆహారం తీసుకోవడం వల్ల కలిగే లాభాల గురించి, పిల్లల ఎదుగుదల గురించి, వారి మేధో వికాసం గురించి వివరించారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పరిశుభ్రత పాటించడం, చేతులు శుభ్రంగా కడుక్కోవడం ద్వారా అనేక రోగాలను దూరం పెట్టవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు,పిల్లలు పాల్గొన్నారు.

వివేకానంద యువజన సంఘం మహా అన్నప్రసాద వితరణ



భువనగిరి, ప్రజాస్ఫూర్తి: వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో 48 సంవత్సరం గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి స్థానిక పి సి సి ఆహ్వాన కమిటీ సభ్యులు తంగళ్ళపల్లి రవికుమార్ జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ అవేజ్ రేహ్మాన్ చిస్తి స్థానిక కౌన్సిలర్లు స్వాతి మహేష్, సరగడ రాజ్యలక్ష్మి అమర్నాథ్ , నాకోటి నాగు, కాంగ్రెస్ నాయకులు రఘుబాబు , శివ కుమార్ భువనగిరి గణేష్ ఉత్సవ కమిటీ చైర్మన్ నాగభూషణం జిల్లా ఉత్సవ కమిటీ చైర్మన్ పసుపునూరి నాగభూషణం, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మార్త వెంకటేశం ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇట్టి కార్యక్రమం స్వామి వివేకానంద యువజన సంఘం అధ్యక్షులు కూరెల్ల విశ్వం సంఘ సభ్యులు పసుపునూరి మనోహర్ బాదం వెంకటేశ్వర్లు , మంచి కంటి రవికుమార్ , మంచాల రమేష్ , ఎడవెల్లి నవీన్ జూలూరు కిరణ్ , లెంకలపల్లి శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగినది. ఇట్టి కార్యక్రమంలో గంజ్ వ్యాపారస్తులు మరియు దాతలు పాల్గొని ఇట్టి కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.

స్వర్ణగిరిలో నేడు గిరి ప్రదక్షణ



భువనగిరి, ప్రజాస్ఫూర్తి: స్వర్ణగిరి దేవాలయంలో శ్రవణా నక్షత్రం సందర్భంగా బుధవారం గిరి ప్రదక్షణ నిర్వహించడం జరుగుతుందని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకొని ఉదయం 6 గంటల 30 నిమిషాలకు యాదాద్రి తిరుమల స్వర్ణ గిరి దేవస్థానం లో గిరి ప్రదక్షణ కార్యక్రమం కలదు గిరి ప్రదక్షణ లో పాల్గొనే భక్తులు హిందూ సాంప్రదాయ దుస్తులతో స్వామివారి పాదాల వద్దకు రాగలరు.

పర్యాటకులకు స్వర్గధామంగా ఈదుల పూసపల్లి చెరువు

*** ఎమ్మెల్సీ రవీందర్ రావు**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ ప్రజలకు అద్భుతమైన విహార స్థలంగా ఈదుల పూసపల్లి చెరువు నిలవనుందని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు పేర్కొన్నారు.కాళోజీ వాకర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి మేరకు, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు సోమవారం ఉదయం మహబూబాబాద్ లోని ఈదుల పూసపల్లి చెరువు, పరిసర ప్రాంతాలను సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,అటవీ శాఖ ఆధ్వర్యంలో సుమారు 170 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో జరుగుతున్న పర్యాటక అభివృద్ధి పనులు అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. చారిత్రాత్మక కాకతీయుల కాలం నాటి ఈదుల పూసపల్లి చెరువు చుట్టూ గుట్టలు, అందమైన దీవులు ఉండటం ప్రత్యేకత అని,ఇక్కడ యోగా సెంటర్లు,పూల వనాలు, వాకింగ్ ట్రాక్, బెంచీలు, డైనింగ్ హాల్స్, నాలుగు అంతస్తుల వాచ్ టవర్ వంటి బ్రహ్మాండమైన నిర్మాణాలను అటవీ శాఖ చేపట్టిందని తెలిపారు.పూర్వం అడవులు, చెట్ల మధ్య ఉన్న ఊరు కాబట్టి దీనికి మ్రానుకోట అనే పేరు ఉండేదని, కాలక్రమంలో అది మానుకోటగా,ఆ తర్వాత మహబూబాబాద్ గా మారిందని గుర్తు చేశారు.ఈ ప్రకృతి వనాన్ని మరింత వేగవంతంగా అభివృద్ధి చేయాలని కోరుతూ,అటవీ శాఖ డీఎఫ్ఓ తో సమావేశం కానున్నట్లు తెలిపారు.పిల్లలకు ఆహ్లాదాన్ని పంచేందుకు ఈదుల పూసపల్లి వద్ద గానీ, జమాలపల్లి ప్రకృతి వనం వద్ద గానీ మినీ జూ పార్క్ ఏర్పాటు చేయాలని కోరుతున్నట్లు వెల్లడించారు.మహబూబాబాద్ జిల్లా కేంద్రంగా వేగంగా అభివృద్ధి చెందుతోందని, మెడికల్, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలలు, కలెక్టరేట్,ఎస్పీ కార్యాలయాలు అందుబాటులోకి వచ్చాయని అన్నారు. రింగ్ రోడ్డు, అనుసంధాన రహదారులతో మహబూబాబాద్ ను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని కోరారు.

కార్మికుల హక్కుల రక్షణకు కట్టుబడి ఉంటాం

*** ఎమ్మెల్యే కూనంనేని**



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం :కొత్తగూడెం నగర పాలక సంస్థ పరిధిలోని వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు రెండేళ్లకు సంబంధించిన యూనిఫారాలు, కాస్మాటిక్స్ పంపిణీ కార్యక్రమం మంగళవారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి మేయర్ మూడ్ గణేష్‌తో కలిసి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరై కార్మికులకు దుస్తులు, సామగ్రిని అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రతతో పాటు ప్రజలకు ప్రాథమిక సేవలందిస్తున్న కార్మికుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తామని, కార్మికులు విధుల్లో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తూ, పని ప్రదేశాల్లో వారికి పూర్తి స్థాయి భద్రతను నిర్ధారిస్తామన్నారు. జీవన వ్యయం పెరుగుతున్న నేపథ్యంలో కార్మికుల వేతనాల పెంపునకు కృషి చేయడంతో పాటు, చట్టబద్ధంగా వారికి లభించాల్సిన ప్రయోజనాలు,హక్కులను అమలు చేసేందుకు నిరంతరం శ్రమిస్తామని పేర్కొన్నారు.శ్రమజీవులకు అండగా ఉంటూ వారి ఆశయాలు, అవసరాల పక్షానే నిలబడతామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ విజయానంద్, కార్పొరేటర్లు బోయిన విజయ్ కుమార్, మునిగడప పద్మ, ధనలక్ష్మి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, నాయకులు కంచర్ల జమలయ్య, యూసఫ్, గెద్దాడు నగేష్, మునిగడప వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సమతుల్య ఆహారంతో ఆరోగ్యవంతమైన సమాజం



వలిగొండ, ప్రజాస్ఫూర్తి: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషక విలువలతో కూడిన సమతుల్య ఆహారాన్ని తీసుకోవడం ద్వారానే రక్తహీనతను నివారించి,ఆరోగ్యవంతమైనసమాజాన్ని నిర్మించవచ్చని ఐసిడిఎస్ వలిగొండ సెక్టర్ సూపర్వైజర్ పారిజాత,వలిగొండ అంగన్వాడి టీచర్ బాలవిజయ అన్నారు. పోషణ మాసం ఉత్సవాల్లో భాగంగా వలిగొండ మండల కేంద్రంలోని అంగన్‌వాడీ 2 కేంద్రంలో మంగళవారం పోషకాహార అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాలు, మొలకెత్తిన గింజలు, గుడ్లతో ప్రత్యేక ఆహార ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఏయే ఆహార పదార్థాల్లో ఎలాంటి విటమిన్లు, పోషకాలు ఉంటాయో వివరించారు. పిల్లలు, గర్భిణీలు, బాలింతలు మంచి పోషక విలువలు ఉండే సమతుల ఆహారం ప్రతిరోజు తీసుకోవాలని, సమతుల ఆహారం తీసుకోవడం వల్ల కలిగే లాభాల గురించి, పిల్లల ఎదుగుదల గురించి,వారి మేధోవికాసం గురించి వివరించారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పరిశుభ్రత పాటించడం, చేతులు శుభ్రంగా కడుక్కోవడం ద్వారా అనేక రోగాలను దూరం పెట్టవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు,పిల్లలు పాల్గొన్నారు.

సూర్యాపేట కు బుల్లెట్ ట్రైన్ రావడమే ప్రధాన లక్ష్యం



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట:సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ రావడమే తమ ప్రధాన లక్ష్యమని జిల్లా పాస్టర్ల సంఘం అధ్యక్షుడు మీసాల గోవర్ధన్ అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో బుల్లెట్ ట్రైన్ సాధన కోసం చేపట్టిన 40వ రోజు రిలే నిరాహార దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ వచ్చేలా సంబంధిత ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల ఆకాంక్షను గౌరవించి పాత అలైన్‌మెంట్ ప్రకారం బుల్లెట్ ట్రైన్ మార్గాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. సూర్యాపేటను విస్మరిస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి పి సామేల్ కిరణ్, నియోజకవర్గ అధ్యక్షుడు దేవిడ్ రాజ్ జలగం, పట్టణ అధ్యక్షుడు కే కరుణాకర్, సూర్యాపేట రూరల్ అధ్యక్షుడు జి సోలోమెన్ రాజ్, గౌరవ సలహాదారులు జాన్ మార్క్, బాబురావు, జీవరత్నం, లాజర్, ఏసు పాదం, ఏజ్రా, సుదర్శన్ రాజు సెల్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మైనర్ బాలికపై లైంగిక దాడి.. నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష



భూపాలపల్లి, ప్రజా స్ఫూర్తి: మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడి, ఆమె ఆత్మహత్యకు కారణమైన నిందితుడు గోల్కొండ రాజశేఖర్‌కు భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జె. జీవన్‌కుమార్ మంగళవారం యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించారు.2021 డిసెంబర్ 9న కాటారం మండలం ధన్వాడకు చెందిన మైనర్ బాలిక ఆధార్ కార్డు మార్పు కోసం కాటారం వెళ్లేందుకు బస్టాండ్‌లో వేచి ఉండగా, పరిచయస్తుడైన రాజశేఖర్ మోటార్‌సైకిల్‌పై తీసుకెళ్లాడు. మార్గమధ్యంలో బెదిరించి చింతకాని క్రాస్‌రోడ్డు వద్ద గదికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపుతానని బెదిరించినట్లు బాలిక బాబాయి ఫిర్యాదు మేరకు అప్పటి కాటారం ఏఎస్ఐ మహేందర్ కేసు నమోదు చేయగా, అప్పటి సీఐ రంజిత్‌రావు దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం సాక్ష్యాధారాలతో కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు.కేసు విచారణలో పోలీసులు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఎన్. విష్ణువర్ధన్‌రావు, జి.వెంకట్రామ్ వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాల ఆధారంగా నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష విధించారు.కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అభినందించారు.

పట్టాదారు పుస్తకాల కోసం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: దశాబ్దాలుగా పాస్ పుస్తకాలు ఇవ్వకుండా వేధిస్తున్నారని నిరసిస్తూ గరిడేపల్లి తహశీల్దార్ కార్యాలయం ముందు మంగళవారం బాధితులు చేపట్టిన రిలే నిరాహార దీక్షకు ప్రజా కళాకారుడు బాదే నరసయ్య మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెలిదండ రెవిన్యూ పరిధిలోని 502 సర్వే నంబర్ భూమికి సంబంధించి భానోత్ లక్ష్మయ్య 1980 నుండి అనుభవంలో ఉన్నా అధికారులు పాస్ పుస్తకాలు ఇవ్వకుండా తిప్పుకుంటున్నారని మండిపడ్డారు. అలాగే కితవారిగూడెంకి చెందిన జ్యోతి, దూత ప్రియాంక, మర్రికుంటకు చెందిన ఉల్లెందుల వెంకటయ్య నరసింగు బక్కయ్య పలువురు బాధితులు అధికారుల చుట్టూ తిరిగీ తిరిగీ చివరికి కొందరు కన్నుమూశారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత రైతులకు తక్షణమే పట్టాదార్ పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాధితులు పార్వతి, లక్ష్మయ్య, రుక్మమ్మ, కవిత, గోపి, త్రిష, వెంకన్న, సైదులు తదితరులు పాల్గొన్నారు.

తాసిల్దార్ స్రవంతి వివరణ

కోర్టు ఆదేశాలు ఉన్న భూముల విషయంలో చట్టపరమైన ప్రక్రియలు, రికార్డుల సమగ్ర పరిశీలన చేసి అర్హులైన బాధితులకు పట్టాదార్ పాస్ పుస్తకాలు మంజూరుకు కృషి చేస్తానన్నారు.

రామవరం కవులకు 'అక్షరకిరీటి' గౌరవం



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: కవులు, కళాకారులకు పుట్టినిల్లుగా పేరొందిన రామవరం ప్రాంతానికి చెందిన నలుగురు ప్రతిభావంతులు జాతీయస్థాయి పురస్కారాలతో సత్కారం పొందారు. 'ప్రతిభమీద పట్టాభిషేకం' నినాదంతో కవులు, కళాకారులను ప్రోత్సహిస్తున్న అంతర్జాతీయ సాహిత్య,సాంస్కృతిక సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక వస్త్ర వ్యాపారి, అభ్యుదయ కవి సయ్యద్ అబ్దుల్ నజీర్‌ను శ్రీశ్రీ కళావేదిక భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శిగా, అభ్యుదయ కవి, ప్రజానాట్యమండలి గాయకుడు తూముల శ్రీనివాస్‌ను కార్యదర్శిగా, ప్రకృతి ప్రేమికుడు, సమాజ సేవకుడు మహమ్మద్ ముస్తఫాను కార్యదర్శిగా, కవయిత్రి ఎ.విక్టోరియా రాణిని సహాయ కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా నలుగురినీ 'అక్షరకిరీటి' జాతీయస్థాయి పురస్కారంతో సత్కరించారు. తమ సాహిత్య, సామాజిక సేవలతో రామవరం గ్రామానికి గుర్తింపు తీసుకొస్తున్న ఈ కవి ఆణిముత్యాలకు పలువురు అభినందనలు తెలిపారు.

హోర్డింగ్ పై వ్యక్తి హల్‌చల్.. క్రేన్‌తో సురక్షితంగా కిందకు

-ఆర్టీసీ చౌరస్తాలో ఉద్రిక్తత.



జనగామ, ప్రజాస్ఫూర్తి : పట్టణం లోని ఆర్టీసీ చౌరస్తా లో మంగళవారం ఉదయం పారునంది సుధాకర్ అను వ్యక్తి మున్సిపల్ హోర్డింగ్ పైకి ఎక్కి హంగామా సృష్టించాడు. పై నుంచి దూకేస్తానంటూ కేకలు వేయడంతో స్థానికులు, వాహనదారులు ఆందోళనకు గురై య్యారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్రేన్ సహాయంతో రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. అనంతరం వ్యక్తిని సురక్షితంగా కిందకు దించడంతో పరిస్థితి సద్దుమణిగింది.

గిలకత్తుల వెంకటరమణకు అక్షర కిరీటి బిరుదు



కూసుమంచి, ప్రజా స్ఫూర్తి: కూసుమంచి మండలం గుర్వాయిగూడెం తండా పాఠశాల ఉపాధ్యాయుడు, కవి, ప్రముఖ రచయిత గిలకత్తుల వెంకటరమణకు 'అక్షర కిరీటి' బిరుదు లభించింది. 176 వ జాతీయ "ద్విశతాధిక" కవి సమ్మేళనం శ్రీ శ్రీ కళావేదిక భద్రాద్రి కవితా పండుగను డాక్టర్ పాల్ రాజ్ ఇంజనీరింగ్ కాలేజీ భద్రాచలంలో నిర్వహించారు. ఈ కవితా సమ్మేళనానికి 200 మంది రచయితలు,కవులు,పాల్గొన్న సభలో ముఖ్య అతిథిగా ఐటీడీఏ పీవో. బి.రాహుల్, తాళ్లూరి పంచాక్షరయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో శ్రీ శ్రీ కళావేదిక జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరి భూషణం, జాతీయ అధికార ప్రతినిధి వరలక్ష్మి సాయిరాం, యర్రం శెట్టి పూర్ణిమ, పార్థసారథి,చేతుల మీదుగా అక్షర కిరీటి బిరుదుతో పాటు జ్ఞాపిక, ప్రశంసపత్రంతో ఘనంగా సత్కరించారు. సాహిత్య,సామాజిక రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు ఆయనను అభినందించారు.

ముస్తాబాద్‌లో గొర్రెలు, పొట్టేళ్ల దొంగల అరెస్ట్.. ముగ్గురు రిమాండ్!

*** వివరాలు వెల్లడించిన ముస్తాబాద్ ఎస్సై జ్యోతి**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ గ్రామానికి చెందిన బండారి లింగయ్యకు చెందిన గొర్రెలు చోరీకి గురైన ఘటనపై పోలీసులు వెంటనే స్పందించి కేసును చేధించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ముస్తాబాద్ ఎస్సై జ్యోతి తెలిపారు.ముస్తాబాద్ గ్రామానికి చెందిన బండారి లింగయ్య తన వద్ద ఉన్న మూడు గొర్రెలు, రెండు పొట్టేళ్లను ఎవరో గుర్తుతెలియని దొంగలు ఎత్తుకుపోయారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న ఎస్సై జ్యోతి తన సిబ్బందితో కలిసి దర్యాప్తు వేగవంతం చేశారు. పోలీసులు తమదైన శైలిలో గాలింపు చర్యలు చేపట్టి దుబ్బాక గ్రామానికి చెందిన శ్రీనివాస్, నూనె ప్రభాకర్ ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో వారు గొర్రెలు, పొట్టేళ్లను దొంగిలించినట్లు అంగీకరించారు. అంతేకాకుండా, ఆ మూగజీవాలను తంగళ్ళపల్లి మండలంలోని అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన చింతల రాజు అలియాస్ రవి అనే వ్యక్తికి విక్రయించినట్లు వారు వెల్లడించారు. దీంతో పోలీసులు వెంటనే స్పందించి కొనుగోలుదారుడైన చింతల రాజు అలియాస్ రవిని కూడా అదుపులోకి తీసుకున్నారు. మొత్తం ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై జ్యోతి వెల్లడించారు. ఈ త్వరిత గతిన స్పందించి దొంగలను పట్టుకున్న పోలీసులకు బండారి లింగయ్య కృతజ్ఞతలు తెలిపారు.

మహిళలు, చిన్నారులపై హింసకు అడ్డుకట్ట వేయాలి

*** మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి: సమాజంలో లింగ వివక్షకు తావులేకుండా మహిళలు, బాలికలకు సమాన అవకాశాలు కల్పించడంతోపాటు మహిళలు, పిల్లలపై జరుగుతున్న హింసను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని మాజీ మున్సిపల్ చైర్మన్ బర్రె జహంగీర్, మున్సిపల్ వైస్ చైర్మన్ పోతం శెట్టి మంజుల లు అన్నారు. సోషల్ ఫర్ యాక్షన్ విత్ రూరల్ (ఎస్ఎఆర్ఏ) బర్రె ప్రమీల షార్ప్ ఆధ్వర్యంలో మంగళవారం భువనగిరి పట్టణంలోని స్థానిక పెన్షనర్ హాల్లో నిర్వహించిన జిల్లా స్థాయి మున్సిపాలిటీ శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జెండర్ సమానత్వం, మహిళలు-పిల్లలపై హింస నివారణ, జెండర్ స్పందనాత్మక స్థానిక పాలన అంశాలపై అవగాహన కల్పించారు. స్థానిక సంస్థల పాలనలో మహిళల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరలక్ష్మి న్యాయవాది, సోషల్ కన్సల్టెంట్ , వినిలా సఖి సెంటర్ అడ్మిన్,కౌన్సిలర్లు తాహరా బేగం బబ్లూ,బింగి నరేష్,చీమల రాజేష్, కోఆప్షన్ సభ్యులు పల్లెర్ల యాదగిరి, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు బండారు రవి వర్ధన్,బర్రె సుదర్శన్,శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఇంచార్జీ కలెక్టర్ భాస్కర్ రావు



భువనగిరి, ప్రజాస్ఫూర్తి: మంగళవారం భువనగిరి పట్టణంలోని భువనగిరి పెద్ద చెరువును ఇంచార్జీ కలెక్టర్ సందర్శించి,వినాయక నిమజ్జన కార్యక్రమానికి సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా నిమజ్జన ప్రాంతంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. నిమజ్జన సమయంలో భద్రతా చర్యలు, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, లైటింగ్ తదితర సౌకర్యాలను పర్యవేక్షించాలని తెలిపారు. భక్తులు జాగ్రత్తగా ఉంటూ క్రేన్ల ద్వారా ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం చేయాలన్నారు. గజ ఈతగాళ్లు చెరువు వద్ద అందుబాటులో ఉండాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు కలగకుండా భార్గేటింగ్ చేయాలన్నారు.అలాగే నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ కమిషనర్ ప్రకాష్ రెడ్డి,డి.ఈ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జీళ్ళచెరువులో వినాయక నిమజ్జన ఘాట్ ఏర్పాటు

*** మండలంలోని అన్ని విగ్రహాలు జీళ్ళచెరువులో నిమజ్జనం జరగాలి**

*** కూసుమంచి తహసిల్దార్ సైదులు,ఎస్సై నాగరాజు**



కూసుమంచి, ప్రజా స్ఫూర్తి: వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరగాలని అందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకెళ్లి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసిల్దార్ డి సైదులు అన్నారు. మంగళవారం జీళ్లచెరువు గ్రామంలోని ఊర చెరువు వద్ద ఏర్పాటుచేసిన నిమజ్జన ఘాట్ ను ఆయన మండల పరిషత్ అధికారి జశ్వంత్ కుమార్,కూసుమంచి ఎస్సై నాగరాజు తోకలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ సైదులు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా సుమారు 170 విగ్రహాలు ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసినట్లు తెలిపారు. గత సంవత్సరం వరకు కూసుమంచి గ్రామంలోని చెరువులో నిమజ్జనం అవకాశం ఉండేదని ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల కారణంగా కూసుమంచి గంగాదేవి చెరువులో నీరు తగినంత లేనందున ఈసారి జీళ్లచెరువు గ్రామంలోని ఊర చెరువును నిమజ్జనానికి ఎంపిక చేసినట్లు తెలిపారు. కూసుమంచి మండలంలోని విగ్రహాలే కాకుండా వేరే జిల్లాల నుంచి సూర్యాపేట ఖమ్మం రూరల్ మండలాల నుంచి కూడా నిమజ్జనానికి విగ్రహాలు రానున్నట్లు ఆయన తెలిపారు. ఈ నిమజ్జన కార్యక్రమానికి 30 మంది గజ ఈతగాళ్లు భారీ క్రేను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉత్సవ కమిటీల బాధ్యులు విగ్రహాలను త్వరితగతిన నిమజ్జనానికి తీసుకుని వచ్చి నిమజ్జనం చేయవలసిందిగా కోరారు. నిమజ్జనం ఘాటు వద్ద పోలీసుల ఇతర శాఖల అధికారుల సూచనలు సలహాలు పాటించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా నిమజ్జనం ముగించుకొని తిరిగి వారి వారి గ్రామాలకు భక్తులు వెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సైదులతో పాటు ఎంపీడీవో జశ్వంత్ కుమార్, కూసుమంచి ఎస్ఐ నాగరాజు, ముత్యాల గూడెం, చేగొమ్మ, జీళ్ల చెరువు, కేశవపురం, జుజ్జులరావుపేట, తదితర గ్రామాల కార్యదర్శులు జీలచెరువు సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు స్పీడ్..

గడువు లోగా పూర్తి చేయాలి : ఎమ్మెల్యే కడియం



జనగామ, ప్రజాస్ఫూర్తి : వీబీ గ్రాంజీ పథకం కింద మంజూరై చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఘన్‌పూర్ (స్టేషన్) ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో కలిసి వివిధ శాఖల అభివృద్ధి,సంక్షేమ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తక్కువ వర్షపాతం నేపథ్యంలో రైతులకు ఇబ్బందులు రాకుండా ప్రత్యామ్నాయ పంటల పై అవగాహన కల్పించాలని సూచించారు. వ్యవసాయ విద్యుత్ సరఫరా లో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, నియోజకవర్గంలో మంజూరైన 8 సబ్‌స్టేషన్లలో మిగిలిన పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామ సమాఖ్య, మహిళా సంఘాల భవనాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయడంతో పాటు పెండింగ్ భూసేకరణ, కాలువల శుభ్రత పనులను త్వరితగతిన చేపట్టాలని సూచించారు.కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ పాఠశాలల ప్రహరీ గోడలు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలకు ప్రాధాన్యత ఇచ్చి వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.వీబీ గ్రాంజీ కింద చేపట్టిన పనులను గడువు లోగా పూర్తి చేసి ప్రజలకు ప్రయోజనం చేకూర్చాలని సూచించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కలెక్టర్ పాఠాలు.. జీడికల్ బ్రహ్మోత్సవాల పై సమీక్ష

*** 40 వేల మంది భక్తులకు అనుగుణం గా ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు.**



లింగాల ఘణపురం/జనగామ, ప్రజాస్ఫూర్తి : విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మోడల్ పాఠశాల,జూనియర్ కళాశాలను ఆయన పరిశీలించారు. 9వ తర గతి విద్యార్థులతో ఇంగ్లీష్ గ్రామర్ పై ప్రశ్నలు అడిగి,నామవాచకం,క్రియ,సరైన వాక్య నిర్మాణం పై స్వయంగా బోధించారు. 10వ తరగతిలో ఫిజిక్స్ బోధనను పరిశీలించి, అదనపు తరగతి గదుల పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పాఠశాల వంటశాలలో కట్టెల పొయ్యి పై వంట చేయడంపై అసహనం వ్యక్తం చేసి, గ్యాస్‌పైనే వంట చేయాలని,విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని ఆదేశించారు. అనంతరం జీడికల్ శ్రీ రామచంద్ర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి, డీసీపీ రాజ మహేంద్ర నాయక్‌తో కలిసి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు.నవంబర్ 23 నుంచి డిసెంబర్ 5వ తేదీ వరకు జరగనున్న జాతరకు గతంలో కంటే అధికంగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున తాగునీరు, పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు, రహదారులు,విద్యుత్,పార్కింగ్ తదితర సౌకర్యాలను పకడ్బందీగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భక్తుల భద్రతకు పటిష్ట పోలీసు బందోబస్తు,వైద్య శిబిరాలు, 108 సేవలు అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి,కలెక్టర్ సందీప్ కుమార్ ఝా 30 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా బెజ్జం సాయి



ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : జిల్లాలోని సర్పంచుల సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం కృషి చేయాలని తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణ రెడ్డి సూచించారు. హైదరాబాద్ లోని లకిడికపూల్ తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో దామరచర్ల మండలం దిలావర్‌పూర్ గ్రామ సర్పంచ్ బెజ్జం సాయిను నల్లగొండ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షుడు బెజ్జం సాయికి నియామక పత్రాన్ని అందజేశారు. అలాగే జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చింతలపూడి భాస్కర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా చాట్ల చిరంజీవిలను నియమిస్తూ నియామక పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా చింపుల సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని సర్పంచుల సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం కృషి చేయాలని, సర్పంచులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేయాలని సూచించారు. జిల్లా నూతన అధ్యక్షుడు బెజ్జం సాయి మాట్లాడుతూ నల్లగొండ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా తనను నియమించిన తెలంగాణ పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణ రెడ్డికి, అలాగే తనపై విశ్వాసం ఉంచి మద్దతు తెలిపిన నల్లగొండ జిల్లా సర్పంచులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.సర్పంచుల హక్కులు, సంక్షేమం గ్రామాల అభివృద్ధి కోసం తన వంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని పేర్కొన్నారు.

గణేష్ నిమజ్జోత్సవాలను శాంతి యుతంగా జరుపుకోవాలి



ప్రజాస్ఫూర్తి,.భైంసా: నిర్మల్ జిల్లా భైంసా (మహిషా) పట్టణంలో గణనాథుని నిమజ్జనోత్సవాల సందడి నెలకొంది. ఎటు చూసినా వినాయక మండపాలు, భక్తుల సందడి కనిపిస్తోంది. "గణపతి బప్పా మోరియా..బై బై గణేశా" అంటూ భక్తులు, యువత నామస్మరణతో వీధులు మార్మోగుతున్నాయి. తొమ్మిది రోజుల పాటు వినాయక మండపాల్లో భక్తిశ్రద్ధలతో విశేషపూజలు అందుకున్న గణనాథులు నిమజ్జనోత్సవానికి తరలుతున్నారు. ఈ సందర్భంగా ముధోల్ నియోజకవర్గ బీజేపీ నాయకులు ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్‌రావు పాటిల్ నిమజ్జనోత్సవాల్లో పాల్గొని గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిమజ్జన కార్యక్రమంలో పాల్గొంటున్న భక్తులు, కార్యకర్తలకు పలు సూచనలు చేశారు.

దివ్యాంగ విద్యార్థుల సంరక్షణను తల్లిదండ్రులు బాధ్యతగా తీసుకోవాలి

జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ భాస్కర్ రావు



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : మండల పరిధిలోని రాయగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష, అలింకో సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం విద్యాశాఖ నిర్వహించిన దివ్యాంగ విద్యార్థుల ఉపకరణాల గుర్తింపు శిబిరాన్ని ఇంచార్జ్ కలెక్టర్ భాస్కర్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దివ్యాంగ విద్యార్థులకు విద్యే అత్యంత ముఖ్యమైన సాధనమని, చదువు వారిని జీవితంలో స్థిరపడేలా చేసి సమాజంలో ఆత్మగౌరవంతో జీవించేలా చేస్తుందని అన్నారు. యు.డి.ఐ.డి. లేదా సదరం సర్టిఫికెట్ ఉన్న ప్రతి అర్హుడికి దివ్యాంగ పెన్షన్ మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. దివ్యాంగ విద్యార్థుల విద్యను వయస్సుతో ముడిపెట్టవద్దని తల్లిదండ్రులకు సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి మాట్లాడుతూ, అలింకో సంస్థ ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను పరీక్షించి, వారి అవసరాలకు అనుగుణంగా ఉచితంగా ఉపకరణాలను అందజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహిత విద్య సమన్వయకర్త పెసరు లింగారెడ్డి, భువనగిరి మండల విద్యాధికారి రంగరాజన్, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అండాలు, ప్రత్యేక విద్యా ఉపాధ్యాయులు శివరాజు, షాజహాన్, నరేష్, జ్యోతి, ఐఈఆర్పీలు సంధ్యారాణి, బాలరాజు, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్, సత్యం, సుజాత, షబానా, రాణి, సరళ, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు



ప్రజాస్ఫూర్తి ,షాద్నగర్ : షాద్‌నగర్ వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో వినాయక ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో బీజేపీ రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని స్వయంగా భక్తులకు అన్నప్రసాదాన్ని పడ్డించారు.ఈ కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా కార్యదర్శి ఇసునాతి శ్రీనివాస్, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షులు మోహన్ సింగ్ నాయక్, బీజేవైఎం నాయకులు వంశీకృష్ణ,సుధాకర్ అప్ప, లక్ష్మర్ నాయక్, శ్యాంసుందర్ రెడ్డి, చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి, కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

షాద్ నగర్ 12 అంగన్వాడి సెంటర్లో మొబైల్ క్రష్ ఆర్గనైజేషన్ ప్రతినిధి



ప్రజాస్ఫూర్తి,షాద్నగర్ : 12 అంగన్వాడి సెంటర్ లో కమ్యూనిటీ మీటింగ్ కండక్ట్ చేయడం జరిగింది. దానికి మొబైల్ క్రేచ్ రంగారెడ్డి డిస్టిక్ సూపర్వైజర్ కే పవిత్ర , అంగన్వాడీ టీచర్ నుస్రత్ బేగం క్రష్ సెంటర్ టీచర్ పర్వీన్ సుల్తానా, హెల్పర్ అశ్విని , కమ్యూనిటీ మెంబర్స్ పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా ప్రెసిడెంట్ ఆఫ్ సైకలాజికల్ మోటివేటర్ ఆలియా సుల్తానా పాల్గొని ఈ క్రెష్ సెంటర్ యొక్క ఉపయోగాలు ఏంటి అంటే ఏడు నెలల పిల్లల నుండి మూడు సంవత్సరాల పిల్లల వరకు ఆరోగ్యం విద్యక్రమశిక్షణ ప్రేమానురాగాలు భద్రతను పిల్లలకు కలగజేయడమే కాక పిల్లలకి గ్రోత్ చెకప్ డాక్టర్ విజిట్స్ మా నుంచి చేయిస్తామని కమ్యూనిటీ మెంబర్స్ కి చెప్పడం జరిగింది . మెయిన్ గా ఇది వచ్చేసి చిన్న పిల్లల తల్లిదండ్రులు సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ కోసమని తల్లులు ఎంబ్రాయిడరీ వర్క్ గాని కుట్టు మిషన్లో గాని బ్యూటిషన్ గాని ఇంకేదైనా వాళ్లకు నచ్చిన పనిని చేసుకోవడానికి వీలుగా పిల్లలని మా దగ్గరికి పంపించి వాళ్లు సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ని చూసుకోవాలని పిల్లలు వాళ్ళ ఎంప్లాయిమెంట్ కి భారం కాకూడదని ఈ సెంటర్స్ పెట్టడం జరుగుతుంది. పిల్లలను పంపించడం తల్లిదండ్రుల బాధ్యత అయితే పిల్లలని జాగ్రత్తగా చూసుకోని వాళ్ళకి విద్య,ఆరోగ్యం, ఆటలు, ప్రేమానురాగాలు,భద్రతను కల్పించడం మా బాధ్యతని అన్నారు.

గణేష్ నిమజ్జోత్సవాలను శాంతి యుతంగా జరుపుకోవాలి

*** ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్**



ప్రజా స్ఫూర్తి, భైంసా: గణేష్ నిమజ్జన ఉత్సవాలను ప్రశాంత వాతవారణం లో జరుపుకోవాలని ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ సూచించారు. భైంసా లో గణేష్ నిమజ్జనం సందర్భంగా మున్నూరు కాపు సంఘ భవనం లో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో మున్సిపల్ చైర్మన్ తుమ్మెల్ల దత్తాతి, మాజీ మున్సిపల్ చైర్మన్ గంగాధర్, కౌన్సిలర్ లు, నాయకులు, సర్పంచ్ లు మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

*** గడ్డెన్న వాగు ప్రాజెక్ట్ లో నిమజ్జనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే.**

గడ్డెన్న వాగు ప్రాజెక్ట్ లో గణనాథుని నిమజ్జనాన్ని ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేలప్రారంభించారు. ఎమ్మెల్యే వెంట ఎస్. పి. తో పాటు పలువురు నాయకులు ఉన్నారు.

పుష్కరాల పనులను వేగవంతం చేయాలి



కాటారం, ప్రజా స్ఫూర్తి: పుష్కరాల ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ప్రతిపాదించిన నూతన తీర్థాల అభివృద్ధి, భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యాల కల్పనకు చేపట్టాల్సిన రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ పి. అశోక్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సిరోంచ-కాటారం ప్రాంతంలో ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు.సిరోంచ వంతెన నుంచి ప్రధాన ఘాట్ వరకు 2 కిలోమీటర్లు, సరస్వతీ ఘాట్ నుంచి పక్షి తీర్థం వరకు 0.8 కిలోమీటర్ల పరిధిలో ఏర్పాటు చేయనున్న ఐదు తీర్థాల ప్రతిపాదిత స్థలాలను పరిశీలించారు. భక్తులకు అవసరమైన మౌలిక వసతులు, రహదారి సౌకర్యాలపై అధికారులతో చర్చించారు.ఆది ముక్తేశ్వర ఆలయం నుంచి సరస్వతీ ఘాట్ వరకు భూసేకరణ పూర్తయిన శాశ్వత రహదారి నిర్మాణ స్థలాన్ని పరిశీలించి, పనులను నిర్దేశిత ప్రణాళిక ప్రకారం వేగంగా పూర్తి చేయాలని సూచించారు. సిరోంచ వంతెన సమీపంలోని వినాయక విగ్రహాల నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలించి, భక్తులకు ఇబ్బందులు లేకుండా భద్రతా చర్యలు, మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు.కన్నెపల్లిలో కొనసాగుతున్న భూముల రీసర్వే పనులను పరిశీలించి, పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని సర్వే సిబ్బందికి సూచించారు.రైతులకు ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, మండల సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గణేశ నవరాత్రి ఉత్సవాలు



రఘునాథపల్లి, ప్రజాస్ఫూర్తి : అన్ని దానాలలోకెల్లా అన్నదానం గొప్పదని భావిస్తూ గణేశ నవరాత్రి ఉత్సవాలను మంగళవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.రఘునాథపల్లి మండల కేంద్రంలోని గిర్నిగడ్డ సమీపంలో బీఆర్ఎస్ జిల్లా యువనేత దుబ్బాక హరీష్ గౌడ్ , నీరజ దంపతులు దుబ్బాక కుటుంబ సభ్యులు గణేశుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారి ఇంటి సమీపంలో భక్తులు, గ్రామస్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు చింతకింది కృష్ణమూర్తి, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కోళ్ల రవి గౌడ్, గౌడ సంఘం జిల్లా నాయకులు బాల్నే పరశురాములగౌడ్, దుబ్బాక నర్సింహులు,మరకల మహేందర్,జీకెఆర్, నోముల మహేందర్,సురుగు రమేష్,సురుగు హరీష్, డీజే మహేందర్, శత్రసి రాము, కంటడి రోహిత్,చెరుకు అజయ్,పొలస నాగరాజు,సురుగు రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

భక్తి పాటల నడుమ కోలన్నల చప్పుళ్లతో మార్మోగిన గణేష్ మండపం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: శ్రీ లక్ష్మీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కోలాటం కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. మహబూబాబాద్ మున్సిపాలిటీ 19వ వార్డులో,కౌన్సిలర్ చిదిరాల అరుణ జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో ఈ కోలాటం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గణనాథుని ముందు చిన్నారులు, మహిళలు లయబద్ధంగా చేసిన కోలాటం నృత్యాలు అందరినీ అలరించాయి.సాంప్రదాయ వాయిద్యాలు,భక్తి గీతాల నడుమ కోలన్నల చప్పుళ్లతో ఆ ప్రాంగణమంతా కోలాహలంగా మారింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ కుమారస్వామి పాల్గొని ప్రత్యేక పూజలు చేసి ప్రసాదాలు స్వీకరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కుంచకర్ల సతీష్,శ్రీనివాసాచారి,గర్రెపల్లి ఉపేందర్,వెన్ను వెంకటేశ్వర్లు,ఆలస్యం సతీష్, కైలాష్ ఉత్సవ కమిటీ సభ్యులు,స్థానికులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలు మార్చేది గురువులే

*** మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.**

ప్రజాస్ఫూర్తి, నలగొండ : విద్యార్థుల జీవితాలు మార్చేది గురువులేనని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.మంగళవారం నల్గొండ జిల్లా కేంద్రంలోని లక్ష్మీ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 2026 ఉత్తమ ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపాధ్యాయులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ నల్గొండ జిల్లాలో ఉపాధ్యాయులు ఎంతో కృషి చేస్తున్నారని,గత సంవత్సరములతో పోలిస్తే ఈ సంవత్సరం రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల నమోదు శాతం 10 శాతం తగ్గగా, నల్గొండ జిల్లాలో మాత్రం 9% పెరిగిందని,ఇది జిల్లా ఉపాధ్యాయుల పనితీరుకు నిదర్శనమన్నారు. పదవ తరగతి తర్వాత ఇంటర్ విద్యలో ఎక్కువమంది ఫెయిల్ అవుతున్నారని దీనిపై దృష్టి సారించాలని, అలాగే మధ్యలోనే బడి మానేసేవారి వివరాలను సేకరించి అందుకు గల కారణాలను విశ్లేషించాల్సిందిగా జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ బి .చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు, వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికి



తీయడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని అన్నారు. ఒకప్పుడు పుస్తకం ద్వారా మాత్రమే విద్యార్థులకు అన్ని అంశాలు బోధించే అవకాశం ఉండేదని, ప్రస్తుతం సామాజిక మాధ్యమాలు, ఇంటర్నెట్ విద్యను అందించడంతోపాటు, విద్యార్థులు చెడిపోయేందుకు కూడా దోహదపడుతున్నాయని, ఈ పరిస్థితుల్లో విద్యార్థులు సక్రమ మార్గంలో విద్యను అభ్యసించి సమాజంలో ఉన్నతులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఎక్కువగా ఉందన్నారు. జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవర్ మాట్లాడుతూ విద్యార్థుల మార్కులు, రిజల్ట్స్ కాకుండా వారికి విలువలు ,గౌరవం నేర్పించాలని ,పిల్లలు సామాజిక మాధ్యమాల ద్వారా చెడు మార్గాన పయనించకుండా టీచర్లు, తల్లిదండ్రులు నైతిక విలువలు పెంపొందించాలన్నారు.ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ చదువుతో విద్యార్థుల జీవితాలు మారతాయని, చదువు విద్యార్థుల జీవితానికి వెలుగునిస్తుందని, ఉపాధ్యాయులు అకుంఠిత దీక్షతో పనిచేసి వారి అభివృద్ధికి తోడ్పాటును అందించాలన్నారు. ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా పని చేస్తూ రాష్ట్రపతిగా సేవలు అందించి చివరి శ్వాస వరకు ఉపాధ్యాయుడుగా కృషి చేసిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఉపాధ్యాయులు వారి వృత్తికి పునరంకితం కావాలన్నారు.నల్గొండ మున్సిపల్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో గురువులకు గొప్ప స్థానం ఉందని, విద్యార్థులకు దిశా, నిర్దేశం చేసేది, విలువలు నేర్పేది, దేశ అభివృద్ధిని పెంపొందించడంలో గురువుల బాధ్యత ఎంతో ఉందన్నారు.జిల్లా విద్యాశాఖ అధికారి సుసింధర్ రావు సమర్పించిన తన నివేదికలో ఈ సంవత్సరం జిల్లాల్లో తొమ్మిది శాతం విద్యార్థులు నమోదు పెరిగిందని,జిల్లాలోని ఉపాధ్యాయులు పాఠశాల పని గంటలకు అదనంగా గంటన్నర పనిచేస్తున్నారని చెప్పారు.డిప్యూటీ మేయర్ అమీర్ అలీ,కార్పొరేటర్ గుమ్మల జానకి, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

నల్లగొండ కార్పొరేషన్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతాం

*** మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**

ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : నల్గొండ కార్పొరేషన్ లో అన్ని సౌకర్యాలు కల్పించి స్మార్ట్ సిటీ గా తీర్చిదిద్దడమే కాక బెస్ట్ కార్పొరేషన్ అవార్డు కూడా అందుకుంటామని రాష్ట్ర రోడ్లు, భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. మంగళవారం అయన నల్గొండ జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయం ఇందిరాభవన్ వద్ద నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లో పరిశుభ్రత కు సంబంధించి కోటి 1 లక్ష రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన రెండు వెట్టింగ్ మెషిన్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఇటీవల నల్గొండ కార్పొరేషన్ స్వచ్ఛ అవార్డు అందుకుందని, నూతనంగా ఏర్పాటైన నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లోని ప్రజలకు అన్ని రకాల సేవలు అందించేందుకు కృషి చేయడం జరుగుతున్నదని, ముఖ్యంగా 24



గంటలు తాగునీరు అందించేందుకు 83 కోట్ల రూపాయలతో టెండర్లు కూడా పిలవడం జరిగిందన్నారు. నల్గొండ కార్పొరేషన్లో ఎస్ డి ఎఫ్ నిధులతో 63 కిలోమీటర్ల సీసీ రోడ్లు వేశామని, అలాగే తక్కిన డివిజన్లలో కూడా రోడ్లతో పాటు, డ్రైన్లు నిర్మిస్తామని, 6 నెలల్లో ఎస్టిపి పూర్తి చేయనున్నట్లు మంత్రి తెలిపారు. నల్గొండ కార్పొరేషన్ కు అన్ని రకాల నిధులను తీసుకువచ్చి అభివృద్ధి చేసి ఉత్తమ కార్పొరేషన్ అవార్డు కూడా తీసుకుంటామనే నమ్మకం తనకున్నట్లు మంత్రి తెలిపారు. నల్గొండ కార్పొరేషన్ పరిధిలో 900 కోట్ల రూపాయలతో ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణం చేపట్టామని, అలాగే డ్రైనేజీ ,ఎస్ టి పి పనులు చేపడుతున్నట్లు తెలిపారు.జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్, నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ అమీర్ అలీ,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ,ఆర్ అండ్ బి అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

గణేష్ నిమజ్జనానికి పటిష్ట భద్రత

*** డాక్టర్ ఎస్పీ జానకి షర్మిల**

ప్ర జా స్ఫూ ర్తి , భైం సా : గ ణే ష్ ని మ జ్జ నో త్స వం సం ద ర్భం గా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో, ఆధ్యాత్మిక ఉత్సాహంతో వేడుకలు జరుపుకోవాలని ఆమె కోరారు. భద్రతా ఏర్పాట్లలో భాగంగా అడిషనల్ ఎస్పీలతో పాటు 14 మంది డీఎస్పీలు, 50 మంది సీఐలు మరియు ఎస్ఐలు, మొత్తం 700 మంది పోలీసు సిబ్బంది విధులు నిర్వర్తించనున్నారని తెలిపారు. ఊరేగింపు మార్గాలు,ప్రధాన చౌరస్తాలు మరియు నిమజ్జన ఘాట్ల వద్ద డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతరం కంట్రోల్ రూమ్ నుండి నిఘా ఉంచుతారు.



సీసీ టీవీ పర్యవేక్షణ: సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తారు. ట్రాఫిక్ మళ్లింపు: నిమజ్జనం సజావుగా సాగేందుకు పట్టణంలో ప్రత్యేక ట్రాఫిక్ నిబంధనలు అమలులో ఉంటాయి. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాలు, పుకార్లు నమ్మవద్దని ఎస్పీ హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం పూర్తి చేసేందుకు ప్రజలు, ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసు శాఖకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గడ్డన్న ప్రాజెక్టు వద్ద భారీ క్రేన్లు,గజ ఈతగాళ్ళతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

విద్యార్థుల్లో పఠనాసక్తి, భాషా నైపుణ్యాల పెంపునకు రీడతాన్ దోహదం

*** కలెక్టర్ కె. హరిత**

కొమురంభీం, ఆసిఫాబాద్ జిల్లా,ప్రజాస్ఫూర్తి: చిన్ననాటి నుంచే పుస్తక పఠనాన్ని అలవాటుగా చేసుకోవడం ద్వారా విద్యార్థుల్లో జ్ఞానం, ఆలోచనా శక్తి, సృజనాత్మకత, వ్యక్తీకరణ సామర్థ్యాలు పెంపొందుతాయని కలెక్టర్ కె.హరిత అన్నారు. విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంచడంతో పాటు చదవడం ద్వారా అవగాహన, భాషా నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు కేబీ రీడతాన్ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో 45 స్కూల్ కాంప్లెక్స్‌లలో విజేతలుగా నిలిచిన ప్రాథమిక స్థాయి విద్యార్థులకు జిల్లా స్థాయి పఠన పోటీలను మంగళవారం తెలంగాణ మోడల్ స్కూల్‌లో నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పఠనాన్ని విద్యార్థుల దైనందిన జీవితంలో భాగంగా చేయాలని సూచించారు. విద్యార్థులు ఆనందంగా చదివి, అర్థం చేసుకుని తమ ఆలోచనలను స్వేచ్ఛగా వ్యక్తీకరించేలా పాఠశాలల్లో పఠన వాతావరణాన్ని మరింత బలోపేతం



చేయాలని పేర్కొన్నారు.నాలుగేళ్లుగా కేబీ రీడతాన్ ఎఫ్ఎల్ఎన్ లక్ష్యాల సాధనలో భాగంగా ప్రాథమిక స్థాయి విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించేందుకు కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో గత నాలుగేళ్లుగా నిర్వహిస్తున్న కేబీ రీడతాన్ కార్యక్రమాన్ని కలెక్టర్ అభినందించారు. ప్రాథమిక విద్యా పునాదులను బలోపేతం చేయడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలకమన్నారు.జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి దహెగాం మండలం దహెగాం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన 5వ తరగతి విద్యార్థి తుమ్మిడి వశిష్ట సాధించారు. ద్వితీయ బహుమతి రెబ్బెన మండలం గొల్లగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థిని యు. ఐశ్వర్యకు, తృతీయ బహుమతి దహెగాం మండలం చిన్నరాస్పల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల 5వ తరగతి విద్యార్థిని రౌతు సాన్విక దక్కాయి. విజేతలకు కలెక్టర్ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరినీ అభినందిస్తూ భవిష్యత్తులో మరింత ఉత్సాహంతో పఠన కార్యకలాపాల్లో పాల్గొనాలని సూచించారు. పుస్తక పఠనాన్ని అలవాటుగా చేసుకుంటే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజు మర్మట్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కామ్టే అనిల్‌కుమార్, రూమ్ టు రీడ్ ఇండియా ట్రస్ట్ రాష్ట్ర మేనేజర్ చారి, జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్, రూమ్ టు రీడ్ జిల్లా ప్రతినిధి మధు, స్థానిక పాఠశాల ప్రిన్సిపల్ మహేశ్వర్, న్యాయ నిర్ణేతలు శ్రీనివాస్, నాగేందర్, రేవతి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉద్యోగాలను సృష్టించే స్థాయికి ఎదగాలి

*** హైదరాబాద్ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ డా. జహూర్‌ఉల్లా**



కుత్బుల్లాపూర్,ప్రజాస్ఫూర్తి : విద్యార్థులు ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా ఉద్యోగాలను సృష్టించే స్థాయికి ఎదగాలని అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ - అలీప్ వీహబ్, హైదరాబాద్ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ డా. జహూర్‌ఉల్లా సూచించారు. బాచుపల్లి, హైదరాబాద్‌లోని బీవీఆర్ఐటీ హైదరాబాద్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ ఉమెన్‌లోని ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో, అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ - అలీప్ వీహబ్, హైదరాబాద్ సహకారంతో ఈ నెల 21 నుంచి 15 రోజుల "స్టార్టప్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ - రైజింగ్ అండ్ యాక్సిలరేటింగ్ ఎంఎస్ఎంఈ పెర్ఫార్మెన్స్" కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ - అలీప్ వీహబ్, హైదరాబాద్ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ డా. జహూర్‌ఉల్లా ఎస్.ఎం.డి. , అలీప్ వ్యవస్థాపక సభ్యురాలు, డబ్ల్యూఈఐటీటీసీ, అలీప్ వైస్ చైర్‌పర్సన్ డా. జ్యోతి ఆర్. పిడికిటి ప్రారంభించారు. ఈ సందర్భంగా డా. జహూర్‌ఉల్లా మాట్లాడుతూ, ప్రస్తుత డిజిటల్ యుగంలో ఇన్నోవేషన్ మరియు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌కు ఎంతో ప్రాధాన్యత ఉందనన్నారు. డా. జ్యోతి ఆర్. పిడికిటి మాట్లాడుతూ విజయవంతమైన పారిశ్రామికవేత్తకు అవసరమైన వివిధ నైపుణ్యాలను విద్యార్థులు అభివృద్ధి చేసుకోవాలని, విద్యార్థుల ఆలోచనలను వాస్తవ రూపంలోకి తీసుకువచ్చి, వాటిని మార్కెట్‌కు మరియు అంతిమ వినియోగదారులకు చేరేలా చేయడానికి అవసరమైన విధానాలను వివరించారు. కార్యక్రమంలో బీవీఆర్ఐటీ హైదరాబాద్ ప్రిన్సిపాల్ డా. ఎ. శారద, వైస్ ప్రిన్సిపాల్ డా. సి.హెచ్. సునీల్ కుమార్, వివిధ డీన్లు, అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ సెల్ ఇన్‌చార్జ్‌లు డా. ఎస్. కల్యాణ్, డా. బి. ఉమారాణి కన్వీనర్లుగా వ్యవహరించారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ ఆబాద్ ఆధ్వర్యంలో ముగ్గురు ఇంజినీర్లకు ఘన సన్మానం



జనగామ,ప్రజాస్ఫూర్తి : జిల్లా కేంద్రం లోని ప్రణామ్ డే కేర్ సెంటర్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆబాద్ ఆధ్వర్యంలో ముగ్గురు ఇంజినీర్లను ఘనంగా సన్మానించారు. ఎండీ గౌస్ పాషా, ఏ.ఈ పొన్న శ్రీశైలం, ఏ.ఈ ఇట్టి మహాదేవుని నాగరాజును శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పూర్వ గవర్నర్లు డాక్టర్ లవకుమార్ రెడ్డి, కన్నా పరశు రాములు,ఏ.విక్షపతి,సి.ఉపేందర్ రెడ్డి, వనమాల సోమయ్య, రేణుకుంట కృష్ణ, బేలిదే వీరయ్య, నాగబండి రవీందర్,అ ల్లాడి ప్రభాకర్ రావు, జి.సీతారాం, కె.రా జశేఖర్ రెడ్డి తదితర లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.

వ్యాపారులు పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలి

వికారాబాద్, ప్రజాస్ఫూర్తి : వ్యాపారులు పరిశుభ్రతను తప్పనిసరిగా పాటిస్తూ, నాణ్యమైన ఆహార పదార్థాలను మాత్రమే ప్రజలకు అందించాలని సర్పంచ్ సూచించారు.గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో సర్పంచ్ పర్యవేక్షణలో గ్రామంలోని హోటల్స్, స్వీట్ హౌసులు, బేకరీలు ఫుడ్ సెక్షన్లను తనిఖీ చేశారు.ఈ తనిఖీలలో ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత, వంటగది పరిసరాలు, ఆహార పదార్థాల నిల్వ విధానం, వంట సామగ్రి, పారిశుద్ధ్య పరిస్థితులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, సెక్రటరీ మేడం ,సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.



జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా లోని రై తులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజి స్ట్రీ లో నమోదు చేసుకుని ఫార్మర్ ఐడీ పొందాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమా ర్ ఝా మంగళవారం ఒక ప్రకటన లో తెలిపారు. ఇప్పటికే ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకున్న రైతులు తమ ఆ ధార్ నంబర్‌ను నమోదు చేసి, ఆధార్ కు అనుసంధానమైన మొబైల్ నంబర్ కు వచ్చిన ఓటీపీని నమోదు చేయడం ద్వారా ఫార్మర్ ఐడీని తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. రైతులందరూ ఈ అవకా శాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలె క్టర్ కోరారు.

బీవీఆర్ఐటీలో విదేశీ విద్యపై అవగాహన



నర్సాపూర్, ప్రజాస్ఫూర్తి: నర్సాపూర్ బీవీఆర్ఐటీలో గ్లోబల్ ఎడ్యుకేషన్ అండ్ కెరీర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విదేశీ ఉన్నత విద్యా సదస్సు, పాస్‌పోర్ట్ మేళా నిర్వహించారు. జర్మనీ, ఫ్రాన్స్, కెనడా, అమెరికా, యూకే, ఆస్ట్రేలియా తదితర దేశాల విశ్వవిద్యాలయాల ప్రతినిధులు పాల్గొని విద్యార్థులకు ఉన్నత విద్య, కోర్సులు, ప్రవేశాలు, కెరీర్ అవకాశాలపై అవగాహన కల్పించారు. పాస్‌పోర్ట్ దరఖాస్తు విధానంపై కూడా విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో బీవీఆర్ఐటీ డైరెక్టర్ డా. కె. లక్ష్మీ ప్రసాద్, ప్రిన్సిపాల్ డా. సంజయ్ దూబే, డీన్లు, విభాగాధిపతులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి కలెక్టర్ అండ రూ. 5 లక్షల ఇందిరమ్మ ఇల్లు మంజూరు

*** ప్రజావాణిలో మేకల పద్మకు ఊరట**



జనగామ, ప్రజాస్ఫూర్తి : ప్రజావాణి తో అర్హులైన పేదల జీవితాల్లో వెలుగులు నింపుతోంది. పాలకుర్తి మండలం మం చుప్పుల గ్రామానికి చెందిన దృష్టి వైక ల్యం ఉన్న మేకల పద్మ తన తండ్రి, త మ్ముడితో కలిసి శిథిలావస్థలో ఉన్న ఇం ట్లో నివాసముంటోంది. వర్షాకాలం లో ఇంట్లోకి నీరు చేరుతుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకునేందుకు ఆర్థి క సాయం అందించాలని ఇటీవల ప్రజా వాణిలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కు ఆమె దరఖాస్తు చేసుకుంది. స్పందిం చిన కలెక్టర్ పద్మకు రూ.5 లక్షల ఇందిర మ్మ ఇల్లు మంజూరు చేశారు. దీంతో దివ్యాంగురాలి కుటుంబానికి ఊరట లభించింది.

గణేష్ నిమజ్జన శోభ యాత్ర
ప్రశాంత వాతావరణములో నిర్వహించుకోవాలి

*** జిల్లా యస్.పి శరత్ చంద్ర పవార్**

ప్రజాస్ఫూర్తి, నల్లగొండ: నల్లగొండ జిల్లాలో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, రూట్ డైవర్షన్లుఇతర భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు.గణేష్ విగ్రహాల ఎత్తును బట్టి ప్రత్యేక నిమజ్జన మార్గాలు, నిమజ్జన ప్రదేశాలను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. నిమజ్జన సమయంలో భక్తులు, నిర్వాహకులు పోలీస్ శాఖ సూచించిన మార్గాలు, నిమజ్జన ప్రదేశాలను తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ సూచించారు. గణేష్ శోభాయాత్ర జిల్లాలోని అన్ని ప్రధాన రహదారులతో పాటు వివిధ కాలనీల్లో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ సీసీటివి కెమెరాలతో పాటు ప్రత్యేకంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి,జిల్లా పోలీసు కార్యాలయానికి అనుసంధానం చేసి ఎలాంటి



అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా కేంద్రంలోని కమాండ్ కంట్రోల్ నుంచి అధికారులు నిరంతరం పర్యవేక్షించనున్నారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని గణేష్ విగ్రహాలు, మండపాలకు జియో ట్యాగింగ్ చేసి తమకు కేటాయించిన నంబర్లతో శోభాయాత్ర ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోనున్నారు. సెయింట్ ఆల్ఫోన్సస్ స్కూల్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఉన్నందున, 10 అడుగుల కంటే ఎక్కువ ఎత్తు ఉన్న గణేష్ విగ్రహాలను ఈ సంవత్సరం 14వ మైలు, హలియా వైపు అనుమతించబడదు.బతుకమ్మ కుంట / వల్లభరావు చెరువులో నిమజ్జనం చేసుకోవాలి.10 అడుగుల కంటే ఎక్కువ ఎత్తు ఉన్న విగ్రహాలు: క్లాక్ టవర్ - రామగిరి - పానగల్ ఫ్లైఓవర్ - తిప్పర్తి - వేములపల్లి మార్గం ద్వారా వేములపల్లి కెనాల్ వద్ద ఏర్పాటు చేసిన నిమజ్జన ప్రదేశంలో నిమజ్జనం చేసుకోవాలి..

*** నిమజ్జన భద్రత కోసం 1000 మంది సిబ్బంది**

గణేష్ నిమజ్జన శోభాయాత్ర సందర్భంగా జిల్లా పోలీసు శాఖ బారీ భద్రతను ఏర్పాటు చేసింది. జిల్లాలో ఎస్పీ పర్యవేక్షణలో ఒక ఏఎస్పీ , ఆడిషనల్ ఎస్పీ, ఆరుగురు డీఎస్పీలు, 23 మంది సీఐలు, 60 మంది ఎస్సైలు, 850 మందికి పైగా ఏఎస్ఐలు, కానిస్టేబుళ్లు, మహిళ కానిస్టేబుల్స్, హోంగార్డులు, బాంబ్ స్క్వాడ్,డాగ్ స్క్వాడ్,ఏ.ర్ సిబ్బంది స్పెషల్ పార్టీ తో కలిపి మొత్తం 1000 బందోబస్తు విధులు నిర్వహించనున్నారు. జిల్లాలోని పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రధాన రహదారులు, నల్గొండ పట్టణంతో పాటు మిర్యాలగూడ మరియు దేవరకొండ వంటి ప్రధాన పట్టణాలలో గణేష్ నిమజ్జన శోభయాత్రను 24/7 జిల్లా పోలీసు కార్యాలయం కమాండ్ కంట్రోల్ పర్యవేక్షిస్తుందన్నారు.జిల్లాలోని ప్రధాన నిమజ్జన ప్రాంతాలలో పోలీసు శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసి,పోలీసు పికెట్లు ఫ్లడ్ లైట్లు,క్రేన్లు,ఏర్పాటు చేశామని,నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉన్నారు. ఎక్కడా ఎలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవడంతో పాటు జిల్లాలో ఏ ప్రాంతానికి వెళ్లినా ఐదు నుంచి పది నిమిషాల వ్యవధిలో పెట్రో వాహనాలు, బ్లూకోట్స్, సంబంధిత పోలీసు అధికారులు అప్రమత్తమయ్యేలా ఆన్‌లైన్ విధానంలో భద్రతను పర్యవేక్షిస్తున్నారు. ప్రజలు, గణేష్ ఉత్సవ కమిటీలు, నిర్వాహకులు పోలీస్ శాఖకు సహకరించి నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఆయన కోరారు.

రోడ్డు విస్తరణకు ప్రజలు సహకరించాలి

*** గ్రామసభలో కరీంనగర్ ఆర్డీవో షర్మిల**

చి గు రు మా మి డి , ప్ర జా స్ఫూ ర్తి : చిగురుమామిడి మండల కేంద్రంలో చేపట్టనున్న నాలుగు వరసల రహదారి విస్తరణ పనులకు ప్రజలందరూ పూర్తి స్థాయిలో సహకరించాలని కరీంనగర్ ఆర్డీవో షర్మిల కోరారు. మంగళవారం చిగురుమామిడి మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామసభలో ఆర్డీవో షర్మిల ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గ్రామంలో నాలుగు వరుసల రహదారి నిర్మాణంతో చిగురుమామిడి మండల కేంద్రం అన్ని రంగాల్లోనూ శరవేగంగా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.రోడ్డు విస్తరణ వల్ల ఇళ్లు,స్థలాలు



కోల్పోయే బాధితులకు ప్రభుత్వం తరపున పూర్తి న్యాయం జరిగేలా తమ వంతు కృషి చేస్తామని ఆమె ప్రజలకు భరోసా ఇచ్చారు.అభివృద్ధి పనులకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకారం అందించాలని పి లు పు ని చ్చా రు . బా ధి తు ల కు పూర్తిస్థాయిలో న్యాయం చేస్తేనే ఇల్లు కూల్చివేతకు సహకరిస్తామని బాధితులు గ్రా మ స భ లో వె ల్ల డిం చా రు . ఈ గ్రా మ స భ లో త హ సి ల్దా ర్ కనకయ్య,సర్పంచ్ ఆకవరం భవాని శివప్రసాద్,సింగిల్ విండో చైర్మన్ చిట్టమల్లరవీందర్,వార్డు సభ్యులు,వివిధ శాఖల అధికారులు,గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కొండాపూర్ వినాయక మండపంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక పూజలు



చిగురుమామిడి, ప్రజాస్ఫూర్తి:చిగురుమామిడి మండలంలోని కొండాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద రాష్ట్ర రవాణా , బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండప నిర్వాహకులు మంత్రికి శాలువాతో సన్మానం చేశారు. ఈ పూజా కార్యక్రమంలో హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, చిగురుమాడి సింగిల్ విండో చైర్మన్ చెట్టు మల్ల రవీందర్, కొండాపూర్ గ్రామ సర్పంచ్ మార్కరాజు, కేడడం లింగమూర్తి, గ్రామ వార్డు సభ్యులు, భక్తులు తదితరులు ఉన్నారు.

జాతీయ స్థాయిలో సత్తా చాటిన మహబూబాబాద్ విద్యా సంస్థ



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి :జాతీయ వేదికపై మహబూబాబాద్ ఖ్యాతిని చాటిచెప్పింది,ఢిల్లీ పబ్లిక్ స్కూల్. విద్యా రంగంలో విశేష సేవలకు గాను, ప్రతిష్ఠాత్మక అవార్డులను సొంతం చేసుకుని, జిల్లాకు గర్వకారణంగా నిలిచింది.న్యూఢిల్లీలోని యశోభూమి, ద్వారకలో నిర్వహించిన బ్రెయిన్ ఫీడ్ ఎడ్యు ఎక్స్ పో గ్లోబల్ స్కూల్ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2026 కార్యక్రమంలో, దేశవ్యాప్తంగా వచ్చిన 800 నామినేషన్లలో డీపీఎస్ మహబూబాబాద్ ఎంపికైంది.ఈ సందర్భంగా మూడు విభాగాల్లో ప్రతిష్ఠాత్మక గౌరవాలను అందుకుంది. వేగవంతమైన అభివృద్ధి, ఉత్తమ ఎదుగుతున్న పాఠశాల, నాయకత్వ ప్రతిభ, దూరదృష్టిగల పాఠశాల నిర్వహణ, జీవన నైపుణ్యాలు, విలువలు,పౌరసత్వ విద్యలో విశిష్టత.న్యూఢిల్లీలో జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వి. మహేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ సుధీర్ కుమార్ అవార్డులను అందుకున్నారు.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డా. జె. ప్రమోద్ రెడ్డి మాట్లాడుతూ,ఈ అవార్డు పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ ,ఉపాధ్యాయులు,విద్యార్థులు చేస్తున్న నిరంతర కృషికి దక్కిన గొప్ప గుర్తింపు అని కొనియాడారు. భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ఉన్నత ప్రమాణాలకు కృషి చేస్తామని తెలిపారు.విద్యార్థుల ఉత్సాహం, క్రమశిక్షణ,సృజనాత్మకత, నేర్చుకోవాలనే తపనే తమ విజయానికి అసలైన బలమని,ఈ గౌరవాన్ని ప్రతి విద్యార్థికి అంకితం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.


ఘనంగా పూజలందుకున్న విఘ్నేశ్వరుడు



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి: చింతల్ డివిజన్ పరిధిలో ఉన్న భగత్ సింగ్ నగర్ కాలనీ రోడ్ నెంబర్ 9 గణేష్ ఉత్సవ యూత్ కమిటీ బాల్ రాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పచ్చిమట్ల నరేందర్ గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు బీసు వెంకటేశం గౌడ్, టైలర్ మల్లేష్,ముప్పడి నరసింహ, శివ పటేల్, నరసింహ ,జాన్, శివ, తదితరులు హాజరయ్యారు

పెయిన్ కిల్లర్స్ అతిగా వాడితే.. కొత్త నొప్పులే..

మనలో చాలా మంది కాస్త తలనొప్పి అనిపించగానే పెయిన్ కిల్లర్స్ వాడుతుంటారు. బాడీ పెయిన్స్‌కి కూడా ట్యాబ్లెట్స్‌ను వేసుకుంటారు. అయితే పెయిన్ కిలర్స్‌ని వాడడం వల్ల వెంటనే నొప్పి తగ్గిన భావన కలిగినా దీర్ఘకాలంలో మాత్రం తీవ్ర సమస్యలు ఎదురవుతాయని నిపుణులు చెబుతున్నారు. మరీ ముఖ్యంగా వైద్యులను సంప్రదించకుండా పెయిన్ కిల్లర్స్‌ని వాడడం వల్ల ఎన్నో సమస్యలకు దారి తీస్తుందని అంటున్నారు.



పెయిన్ కిల్లర్స్ వల్ల కలిగే దుష్ప్రభావాలు...


* పెయిన్ కిల్లర్స్ వేసుకోగానే నొప్పి తగ్గిన భావన కలిగినా తర్వాత తలనొప్పి పెరిగే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.
* పెయిన్ కిల్లర్స్‌ను అతిగా వాడే వారిలో తరచూ తలనొప్పి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు.
* కొన్ని రకాల పెయిన్ కిల్లర్స్‌ని ఎక్కువ రోజులు వాడడం వల్ల కడుపు సంబంధిత సమస్యలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా కడుపులో చికాకు, అల్సర్, అంతర్గత రక్తస్రావం వంటి సమస్యలు వస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.
* ఇక ట్యాబ్లెట్స్‌ను ఎక్కువగా వేసుకోవడం వల్ల ఎదురయ్యే ప్రధాన సమస్యల్లో కిడ్నీలు దెబ్బతినడం ఒకటి. పెయిన్ కిల్లర్స్ అధికంగా వాడే వారిలో మూత్రపిండాల వైఫల్యం ఎక్కువగా కనిపిస్తుందని నిపుణులు చెబుతున్నారు.
* పెయిన్ కిల్లర్స్‌ను అధికంగా వాడడం వల్ల కాలేయంపై ప్రతికూల ప్రభావం పడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఎసిటమైనోఫెన్ ట్యాబ్లెట్స్‌ను ఎక్కువగా తీసుకోవడం వల్ల కాలేయ వైఫల్యానికి దారి తీస్తుంది. పెయిల్ కిల్లర్స్‌ను వాడే సమయంలో కొన్ని పద్ధతులు పాటించాలని నిపుణులు చెబుతున్నారు. పెయిన్ కిల్లర్స్‌ను తీసుకునే సమయంలో ఒక ట్యాబ్లెట్‌కి మరో ట్యాబ్లెట్‌కి మధ్య కనీసం 5 గంటలు ఉండేలా చూసుకోవాలి. అలాగే వారానికి 23 సార్లు కంటే ఎక్కువ తీసుకోకూడదు. నొప్పి చాలా కాలం పాటు కొనసాగితే లేదా తరచుగా సంభవిస్తే వైద్యుడిని సంప్రదించాలి. మరీ ముఖ్యంగా వైద్యులను సంప్రదించకుండా పెయిన్ కిల్లర్స్‌ని వాడడం వల్ల ఎన్నో సమస్యలకు దారి తీస్తుందని అంటున్నారు. పైన తెలిపిన వివరాలు ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉన్న సమాచారం మేరకు అందించినవి మాత్రమే. ఆరోగ్యానికి సంబంధించి వైద్యుల సూచనలు పాటించడమే ఉత్తమం.



ఏందయ్యా సామీ ఇట్ట గాస్తాంది వెన్నెల



పెళ్లి తర్వాత విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న మూవీ రణబాలి. హిస్టారికల్ యాక్షన్‌గా తెరకెక్కుతోన్న ఈ మూవీకి రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వం వహిస్తున్నారు. దసరా కానుకగా అక్టోబర్ 16న థియేటర్లలోకి రాబోతుంది. రణబాలి ఫస్ట్ సింగిల్ మంగళవారం రిలీజైంది. నాయకానాయికల పెళ్లి సందర్భంగా వచ్చే రొమాంటిక్ సాంగ్ ఇది. ఈ పాటలో విజయ్, రష్మిక కెమిస్ట్రీని చాలా అందంగా చూపించారు దర్శకుడు. 19వ శతాబ్దం నాటి వాతావరణం, భార్యాభర్తల అనురాగాన్ని, సరసాన్ని చాలా సహజంగా ఆవిష్కరించారు. లిరిక్స్ ఆకట్టుకుంటున్నాయి. ఈ పాటకు రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించగా...అజయ్ – అతుల్ మ్యూజిక్ అందించారు. అజయ్ గొగవలే, శ్వేతా మోహన్ ఆలపించారు. ఈ పాటను తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో విడుదల చేశారు.



సుబ్బలక్ష్మిగా సర్‌ప్రైజ్ చేస్తా

"ప్యారడైజ్‌లో సుబ్బలక్ష్మి అనే పాత్ర చేశా. కెరీర్‌లో ఇప్పటివరకు చేసిన పాత్రలతో పోలిస్తే ఈ రోల్ చాలా డిఫరెంట్‌గా ఉంటుంది" అని కయదు లోహర్ పేర్కొన్నది. ఆమె హీరోయిన్‌గా నటించిన ప్యారడైజ్ మూవీ సెప్టెంబర్ 24న థియేటర్లలోకి రాబోతుంది. నాని హీరోగా నటించిన ఈ మూవీకి శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహించారు. ప్యారడైజ్ రిలీజ్ సందర్భంగా కయదు లోహర్ పాత్రికేయులతో మాట్లాడుతూ నా క్యారెక్టర్‌లో చాలా సర్‌ప్రైజ్‌లు ఉన్నాయి. అవన్నీ మీరు బిగ్ స్క్రీన్ మీద చూడాలి. జడల్ లవ్ పార్ట్‌నర్‌గా కనిపిస్తాను. అలాగే నాకంటూ సినిమాలో ఒక జర్నీ ఉంటుంది. పెర్ఫార్మెన్స్ స్కోప్ ఉన్న పాత్ర. కథలో చాలా కీలకంగా ఉంటుంది. సుబ్బు క్యారెక్టర్ గురించి అప్పుడే ఎక్కువ రివీల్ చేయకూడదు. ఇప్పటివరకు నేను చేసిన పాత్రలన్నిటితో పోలిస్తే చాలా డిఫరెంట్‌గా ఉంటుంది అని వ్యాఖ్యానించింది.



48 ఏళ్ల క్రితం ఇదే రోజు..

టాలీవుడ్ అగ్ర హీరో మెగాస్టార్ చిరంజీవి ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి నేటితో 48 ఏళ్లు పూర్తయ్యాయి. 1978లో రిలీజైన ప్రాణం ఖరీదు సినిమాతో నటుడిగా తొలిసారి కెమెరా ముందుకొచ్చారు. చెన్నై ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌లో నటనలో శిక్షణ పూర్తిచేసుకొని అవకాశాల కోసం ఎదురుచూస్తున్న శివశంకర వర ప్రసాద్.. ఈ సినిమాతోనే చిరంజీవిగా మారారు. కే వాసు దర్శకత్వంలో రూపొందిన ఈసినిమాలో నర్సయ్య అనే ఆవేశపరుడైన యువకుడి పాత్రలో చిరంజీవి అసమాన నటనతో తెలుగు ప్రేక్షకులను మెప్పించాడు. ప్రాణం ఖరీదు విడుదలై నలభై ఎనిమిదేళ్లు పూర్తయిన సందర్భంగా తన సినీ ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ చిరంజీవి ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. "ఈ సుదీర్ఘ ప్రయాణంలో నన్ను నమ్మి అవకాశాలు ఇచ్చిన ప్రతి నిర్మాతకు, నాలోని నటుడిని కొత్త కొత్త కోణాల్లో ఆవిష్కరించిన ప్రతి దర్శకుడికి, నా ప్రతి సినిమా వెనుక అహర్నిశలు శ్రమించిన నటీనటులకు, సాంకేతిక నిపుణులకు, ప్రతి ఒక్కరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఆరోజు "చిరంజీవి" అనేది నేను పెట్టుకున్న పేరు. నేడు మీ ప్రేమతో అది నాకు దక్కిన శాశ్వతమైన గుర్తింపు "అని ఈ పోస్ట్‌లో చిరంజీవి పేర్కొన్నారు.

వివాదంలో తమన్నా మూవీ

తమన్నా బాలీవుడ్ మూవీ ది వాన్ వివాదంలో చిక్కుకుంది. తాను కంపోజ్ చేసిన పాటను అనుమతి లేకుండా సినిమాలో వాడుకున్నారంటూ ఓ మ్యూజిక్ డైరెక్టర్ ఆరోపించారు. వాన్ మూవీ టీమ్‌పై చట్టప్రకారం పోరాటానికి సిద్ధమవుతోన్నట్లు ప్రకటించారు. సిద్ధార్థ్ మల్హోత్రా, తమన్నా హీరోహీరోయిన్లుగా నటించిన ది వాన్ సెప్టెంబర్ 25న రిలీజ్ కాబోతుంది. రహస్యాలతో నిండిన ఓ అటవీ ప్రాంతం, ఆ ప్రాంత వాసులను కాపాడుతోన్న ఓ దేవత కథతో ఈ మూవీ తెరకెక్కుతోంది. వాన్ మూవీ ట్రైలర్‌ను ఇటీవల రిలీజ్ చేశారు. ఈ ట్రైలర్ ఉపయోగించిన అయిగిరి నందిని అనే సాంగ్‌తో పాటు ట్యూన్ తాను కంపోజ్ చేసినవేనని ఇండిపెండెంట్ మ్యూజిక్ డైరెక్టర్, సింగర్ సర్గమ్ ఆరోపించారు. తన అనుమతి లేకుండా ఆ పాటను ట్రైలర్‌లో ఉపయోగించారని ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టాడు.

కర్ణుడిగా లారెన్స్



రమేష్ వర్మ తమిళంలో ఓ మైథాలజీ మూవీ చేయబోతున్నాడు. ఈ సినిమా టైటిల్‌తో పాటు ఫస్ట్ లుక్‌ను మంగళవారం రిలీజ్ చేశారు. మహాభారతంలోని కర్ణుడి పాత్ర ఆధారంగా తెరకెక్కుతోన్న ఈ సినిమాకు మహావీర్ కర్ణ అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సినిమాలో కర్ణుడిగా టైటిల్ పాత్రలో రాఘవ లారెన్స్ నటిస్తున్నారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో నుదుటిపై సూర్యతిలకంతో రౌద్రంగా లారెన్స్ కనిపిస్తున్నారు. హైబ్రీడ్ లైవ్ యాక్షన్ ఫార్మెట్‌లో దాదాపు 150 కోట్లతో మహావీర్ కర్ణ మూవీ రూపొందుతోంది. భారీ యాక్షన్ సీక్వెన్స్‌లు, పీరియాడికల్ సెట్స్‌తో పాటు గ్రాఫిక్స్, వీఎఫ్ఎక్స్ హంగులతో ఈ సినిమాను తెరకెక్కించేందుకు ప్లాన్ చేస్తున్నారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.